# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 44 సంచిక : 3 విజయవాడ 5-6-2011 పేజీలు : 8 వెల: రు 5.00

www.janashaktionline.com


లోపలి పేజీల్లో...


- కుయుక్తులతో అరబ్ దేశాలలో ప్రజావెల్లువలను అణచివేస్తున్న సామ్రాజ్యవాదం
- పాకిస్థాన్ : ఐ.యం.ఎఫ్. ఆదేశిత షరతులకు లొంగుబాటు
- భారతదేశంలో కార్మికవర్గం ముందున్న సవాళ్ళు
- సెజ్‌లలో జాడలేని పరిశ్రమలు-ఏర్పడని ఉపాధి
- కాంధమాల్ బాధితులకు అందని న్యాయం
- భారతదేశంలో కార్మికుల పోరాటాలు


## రైతాంగ సంక్షోభం

# ఆకర్షణీయ నినాదాలు-తప్పుడు పరిష్కారాలు

**ఆంధ్రప్రదేశ్‌లో** రైంతాంగమెదుర్కొంటున్న సమస్యలు సీజనువారీ రాజకీయ నినాదాలయ్యాయి. పాలకవర్గ పార్టీలు పోటీలుపడి మరీ రైతాంగాన్ని పోరాడమని పిలుపునిస్తున్నాయి. గతంలో వ్యవసాయం దండగమారిదన్నందుకు టిడిపి నేత క్షమాపణ కూడా చెప్పుకున్నాడు. పంజాబులో సేకరించిన ధాన్యాన్ని ఇక్కడి గోదాముల్లో నిల్వ చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. బియ్యం ఎగుమతులు అనుమతించాలని డిమాండు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో రైతాంగం నుండి నేరుగా ధాన్యాన్ని సేకరిస్తున్న ఎఫ్‌సిఐ, ఇక్కడ మిల్లర్ల నుండి సేకరించటమేమిటని విమర్శిస్తున్నారు. విసిగిపోయిన రైతాంగానికి క్రాప్ హాలిడే ప్రకటించటమే ప్రత్యామ్నాయంగా కొన్ని రైతు సంఘాలు ప్రచారం చేస్తున్నాయి. దీనికి ప్రతిగా కాంగ్రెసు ప్రభుత్వం రైతాంగానికి సంస్థాగత రుణ పరపతిని ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నానని ప్రకటించింది. కౌలు రైతాంగానికి పంట రుణాలందజేసే బిల్లును తెస్తానని ఊరిస్తున్నది. వచ్చే ఖరీఫ్ సీజను నాటికి 6 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యంగల గోదాములు సిద్ధమౌతాయని ప్రకటించింది. ఇక తొలకరి వానలు ప్రారంభం కాకుండానే విత్తనాల కొరత ఏర్పడింది. ప్రధాన మంత్రే స్వయంగా ఎరువుల కొరత రాకుండా రవాణా ఏర్పాట్లు చెయ్యమని రైల్వేలను ఆదేశించాడు. మెల్లగా ధాన్యం సేకరణ సమస్య నుండి తొలకరి సాగు సమస్యగా మారుతున్నది. ఈ సీజను వారీ నినాదాలు, పరిష్కారాలను ముందుకు తెస్తున్న పాలకవర్గాలు మౌలిక సమస్యలనుండి రైతాంగం దృష్టిని మళ్లించడమే కాకుండా, ఆ సమస్యలను సృష్టించిన వ్యవసాయరంగ విధానాలను చర్చలోకి రాకుండా చేస్తున్నారు. అంతేకాక తక్షణ సమస్యలకు తాత్కాలిక పరిష్కరరాలను కూడా చేపట్టకుండా కొనసాగించటం ద్వారా, వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తలపెట్టిన కాంట్రాక్టు కార్పొరేటు సాగు తప్ప మరో దారి లేదన్న స్థితిని రైతాంగానికి కల్పిస్తున్నారు.

గత రబీ సీజనులో వరి ధాన్యం అమ్మకాల్లో ఎదురైన సమస్యలూ వాటికి కారణాలు-పరిష్కారాలూ గురించి పాలక వర్గ పార్టీలన్నీ చెప్పింది గుర్తు తెచ్చుకుంటే, రైతాంగం నుండి ధాన్యం కొనుగోలు చేయటానికి గోదాములు ఖాళీలేవు-ఇతర రాష్ట్రాల ధాన్యం ఇక్కడ నిల్వచేశారు-వాటిని ఖాళీ చేయిస్తాం-6లక్షల టన్నుల నిల్వ గోదాములు నిర్మిస్తాం-ధాన్యం కొనుగోలు చెయ్యమని రాష్ట్ర సంస్థలకు ఆదేశాలిచ్చాము- ఇదీ ఆనాటి పాట. ఏడాది తర్వాత మళ్లీ యిదేపాట పాడారు.

గోదాములు సమస్యనే తీసుకుంటే, దేశవ్యాపితంగా 5,60,000 టన్నుల నిల్వ సామర్థ్యంగల గోదాములు నిర్మిస్తామని కేంద్ర మంత్రి గత ఏడాది ప్రకటించారు. మళ్లీ ఈ ఏడు అదే ప్రకటన తిరిగి చేశారు. త్వరలో నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్ర మంత్రికి ఇదే 6 లక్షల టన్నుల గోదాములు ఖరీఫ్ నాటికి రాష్ట్రంలో సిద్ధమౌతాయన్న విధంగా వినిపించింది. వాస్తవమేమిటంటే అదనపు గోదాములు నిర్మించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదు. ధాన్య సేకరణ లక్ష్యాలను కేంద్రం తగ్గించి వేసింది. కనీస మద్దతు ధరను ప్రకటించమే తప్ప ఆ ధర మార్కెట్టులో లేనప్పుడు కొనుగోలుకు పూనుకోవటం లేదు. దీనికి తోడు 2010 నాటికి కిరోసిన్, వంటగ్యాసు, ఎరువులు, ఆహారంలో నగదు బదలీ పథకానికి రంగం సిద్దం చేస్తున్నది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార సరఫరాను వదిలి వేస్తుంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలను గుర్తించి కార్డులిస్తుంది. వారికి కూపన్లు యివ్వటమో వారి అకౌంట్లలో నగదు వెయ్యటమో చేస్తుంది. ప్రజలందరూ ప్రైవేటు వ్యాపారులనుండే బియ్యం కొనుక్కొవాలి. ఇక ప్రభుత్వానికి ధాన్య సేకరణ, మిల్లింగు, నిల్వచేసే పని ఉండదు. కనుక గోదాములు ఖాళీ అవుతాయి. ఇప్పటికే తగ్గించిన ధాన్య సేకరణ లక్ష్యాలతో ఖాళీఅయిన గోదాములను ప్రైవేటుకు అద్దెకిచ్చింది. సారా వ్యాపారానికి అద్దెకిచ్చారని ప్రతిపక్షాలు సెన్సేషన్ చేసాయి తప్ప సేకరణ తగ్గింపు-గోదాముల అద్దె అన్న విధానాన్ని విమర్శించలేదు. రైతాంగానికి భ్రమలు కల్పించి పబ్బంగడుపుకోవటం తప్ప తాను చెప్పిన పరిష్కారాలను కూడా ప్రభుత్వం అమలు చేయలేక పోవటమన్నది పాలకుల నిర్లక్ష్యం మాత్రమేకాదు. ఉద్దేశ్య పూరితంగా అమలు జరుపుతున్న విధానం.

బియ్యం ఎగుమతులకు అనుమతించాలని అందరూ డిమాండు చేస్తున్నారు. దేశంలో పండే వరి పంటలో ఆరవ వంతు మాత్రమే ప్రపంచ మార్కెట్టులో వాణిజ్యం జరుగుతుంది. బియ్యం ఎగుమతులకు పూనుకుంటే ప్రపంచ మార్కెట్లో ధరలు పడిపోయి నష్టాలే వస్తాయి. అప్పుడు రైతాంగానికి గిట్టుబాటు ధర లభ్యం కాదు. దేశ ప్రజలందరూ రెండు పూటలా అన్నం తింటే, ఇప్పుడు పండుతున్న ఆహారధాన్యాలు సరిపోవు. ఆహార భద్రతా చట్టమని చెబుతున్న దాని ప్రకారమే కుటుంబానికి నెలకు 35 కేజీలు సరఫరా చెయ్యాలన్నా, ధాన్యం ఉత్పత్తి పెరుగుదలకు చర్యలు తీసుకోకుండా సాధ్యంకాదని ప్రణాళికా సంఘం తెగేసి చెప్పింది. దేశ ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు తీసుకోకుండా ఎగుమతుల గురించి మాట్లాడటమంటే 100 కోట్ల ప్రజలకు ఆహారం అందుబాటులో లేకుండా చేయటమే.

వాస్తవమేమిటంటే భూమి వినియోగం తగ్గిపోతున్నది. నికరంగా పంటభూమి 1956లో 113 లక్షల హెక్టార్ల నుండి 2008లో 102ల.హె. తగ్గిపోయింది. దీనిలో 1956లో 26 లక్షల హెక్టార్ల భూమి సాగునీరులేక పడావుగా వుండేది. కాగా 2008 నాటికి 41 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఇప్పటి కారణం సాగునీటి లభ్యత లేక పోవటంతో పాటు, గిట్టుబాటుధర, రైతురుణం, ఉత్పాదకాల లభ్యత మొదలైనవి చేరాయి. నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా వ్యవసాయ రంగానికి సబ్సిడీల తగ్గింపే వీటికి కారణం. ప్రభుత్వం తన విధానాలతో భూమిని పడావుగా వుంచేట్లు చేస్తుంటే, క్రాప్ హాలిడే పేరిట పడావు పెడదామని పిలుపు నివ్వటం ఎవరికి వుపయోగపడుతుందో వివరించనక్కరలేదు.

ప్రైవేటు మార్కెట్టు శక్తులు వ్యవసాయ రంగాన్ని తమకు వదిలివేయమని అడుగుతున్నాయి. ఏ రూపంలోనూ ప్రభుత్వ నియంత్రణ ఉండరాదంటున్నాయి. తాము స్వయంగా మార్కెట్టు యార్డులు నిర్మించుకోవటమే కాక ప్రభుత్వరంగంలోని మార్కెట్లు యార్డులను కూడా తమకప్పగించమటున్నాయి. వీటిని ప్రభుత్వం అంగీకరించింది. మెల్లగా అమలు జరుపుతున్నది. రైతాంగానికి చెల్లింపులను గ్యారంటి చేస్తున్న టుబాకో బోర్డు, పొగాకు వేలం కేంద్రాల రద్దుకు ఐటిసి తీవ్ర కుట్రలు సాగిస్తున్నది. ధరలు నిర్ణయించే అధికారం ప్రభుత్వానికుండరాదంటూ విత్తన కంపెనీలు డిమాండు చేస్తున్నాయి. బిటి విత్తనాల ధరలను ప్రభుత్వం పెంచినా, విత్తనాల సరఫరాను నిలిపివేసి కృత్రిమ కొరత సృష్టించి విత్తన కంపెనీలు రైతాంగాన్ని నిలువుదోపిడీ చేస్తున్నాయి. పోషక పదార్థాల ఆధారిత ఎరువుల విధానం పేరిట ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచగా, వ్యాపార వర్గాలు అక్రమ పద్ధతుల్లో మరింతగా పెంచివేశాయి. వీటన్నింటి ఫలితంగా రైతాంగం తీవ్ర సంక్షోభంలో పడ్డారు. సాగు చేపట్టకపోతే జీవనం సాగదు-సాగు చేస్తే నష్టం వస్తుంది. పాత అప్పుకు మరికొంత చేరుతుంది. చివరికి ఆస్థివిలువను మించి అప్పు పెరిగిపోతుంది.

ఇది ప్రభుత్వం కావాలని అమలు చేస్తున్న విధానం. ఆర్థిక మీటలతో పేద రైతాంగాన్ని భూమినుండి గెంటి వేసేందుకు అనుసరిస్తున్న విధానం . ఆ విధంగా సగటు కమతం పెంచి కాంట్రాక్టు-కార్పోరేటు సాగుకు అనుకూల స్థితి ఏర్పరచేందుకు అమలు జరుపుతున్న విధానం. ఇది క్రమంగా చొరబడుతున్నది. కంపెనీలకు ముడిసరుకుగా పంటలను0

0పండించి అందించేందుకు రైతాంగాన్ని నెడుతున్నారు. పామాయిలు తోటల పెంపకానికి సబ్సిడీలిచ్చి ప్రోత్సహించిన ప్రభుత్వం విస్తీర్ణం పెరగగానే సబ్సిడీలను తొలగించింది. గింజ ధరలను ప్రైవేటు కంపెనీలకే వదిలివేసింది. క్రమంగా కాంట్రాక్టు-కార్పోరేటు సాగును తెచ్చేందుకు, రైతు తన భూమిలోనే పాలేరుగా, కంపెనీకి బంధిత ఉత్పత్తిదారుగా చేసేందుకు పూనుకున్నారు. ఈ కాంట్రాక్టు సాగు రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తుంది. రెండవ వైపున దేశపు ప్రజల అవసరాలను తీర్చదు. తనకు లాభం వచ్చేపంటలే వేయించి, దానికి అధికధర చెల్లించగల ధనిక దేశాలలో అమ్ముకుంటుంది. ఆ విధంగా దేశ ప్రజలకు ఆహారాన్ని అందకుండా చేస్తుంది.

(తరువాయి 2వ పేజీలో)

## సంపాదకీయం

## అవినీతిపై 'యుద్ధం'

# అశాంతికి పగ్గాలేసే ప్రయత్నం

**రాజకీయ** రంగంలో అవినీతి, అక్రమార్జనలను ప్రక్షాళనచేసేందుకు కాంగ్రెసు కట్టుబడివుందని సోనియాగాంధి ప్రకటించారు. దాదాపు ఇవే మాటలను యుపిఏ ప్రభుత్వం తరఫున ప్రధానమంత్రి ప్రకటించాడు. కేంద్రం నుండి పంచాయితీల వరకూ అన్నిస్థాయిల్లోనూ ప్రజాధనాన్ని కొల్లగొట్టడమే రాజకీయ నేతలకూ, బడా బూర్జువా వర్గానికీ, బడా వ్యాపారవర్గాలకూ పనిగా మారింది. రాజ్యపాలన అంటే ప్రజాధనాన్ని ఆశ్రితులకు పందారాలు చేయటమన్న అర్థం నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పని జరిగేందుకు చేతులు తడిపే చిన్నస్థాయినుండి లంచాల ఖర్చులను వాణిజ్య ఖర్చుల ఖాతాలో బహిరంగంగా వ్రాసుకునే స్థాయికి సర్వవ్యాపితమైంది. ఇవి ప్రజాజీవన రంగాలన్నిటా సంక్షుభిత పరిస్థితులకు దారితీసింది. దీనికంతా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే కారణంగానూ, ఇది యిటీవలి పరిణామంగానూ ప్రధానమంత్రి చెప్పారు. అయితే నెహ్రూ కాలంనాటి జయంతి ధర్మతేజనుండి ఇందిరాగాంధీ కాలంలో ధీరుబాయ్ అంబానీనుండి నేటి గాలి బ్రదర్స్ వరకూ సైకిళ్లపై అమ్మకాలు సాగించే స్థితినుండి పదేళ్లలో స్వంత విమానాల్లో తిరిగే స్థాయికి చేరారు. ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే, ఆ మాటకొస్తే భారత బడాబూర్జువా వర్గంమనుగడే ప్రభుత్వ ఖజానాపై ఆధారపడి వుంది(నిరంకుశాధికార పెట్టుబడి). నల్లధనం, అక్రమార్జనలు, అవినీతి చర్యలు ఏ పేరుతో పిలిచినా ఇది దేశ ఆర్థిక-రాజకీయ వ్యవస్థతో పీటముడివేసుకుని వుంది.

ఈ అక్రమార్జనలకు అడ్డుకట్ట ఎక్కడనుండి ప్రారంభించాలి అన్న సమస్య చిరకాలంనుండి సాగుతున్నది. లంచాలు యివ్వరాదని నిర్ణయించుకోవాలన్న సూచనలు వ్యక్తిగత పరిష్కారంనుండి ఉన్నత రాజకీయ స్థాయిలో ప్రక్షాళనతో ప్రారంభించాలన్నంత వరకూ చర్చలు సాగేవి. దీనికనువుగా అవినీతి నిరోధకశాఖలూ, కేంద్ర విజిలెన్సు విభాగాలూ ఎన్ని తెరిచినా అవి కూడా అవినీతిమయమయ్యాయి తప్ప వచ్చిన మార్పేమీ లేదు. కారణం స్పష్టమే. దేశ ఆర్థిక-రాజకీయ వ్యవస్థలో సమూలమైన మార్పులను ఇది సూచించలేదు. ఉనికిలోని సామాజిక చట్రంలోనే ప్రక్షాళనకు ప్రతిపాదించటంలో అజాగళస్థనాలయ్యాయి.

ఈ నేపథ్యంలోనే అన్నాహజారే దీక్ష జరిగింది. నాలుగు రోజులపాటు ప్రదర్శనాత్మక చర్యలతో ధనాఢ్యవర్గాల నిధులతో సాగిన ఉద్యమమనే దానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఒక కమిటీని వేసింది. అవినీతి ఆరోపణలను విచారించే లోక్‌పాల్ బిల్లు తయారీకి కుస్తీ మొదలయింది. ప్రధానమంత్రి, రాష్ట్రపతి, సుప్రింకోర్టు న్యాయమూర్తులను ఈ బిల్లు పరిధిలోకి తేవాలా వద్దా అన్నది వివాదంగా చేశారు. యోగాభ్యాసాలు ప్రచారం చేస్తూ కొద్ది సంవత్సరాల్లో వేలకోట్ల వాణిజ్య సామ్రాజ్యాధిపతి ఐన బాబా రామ్‌దేవ్ విదేశాల్లో దాచిన నల్లధనం వెలికితీయాలంటూ అవినీతిపరులకు మరణశిక్ష వేయాలంటూ నిరాహార దీక్షను ప్రకటించాడు. షరా మామూలుగానే ప్రభుత్వం ఆయనతో బేరసారాలు సాగిస్తున్నది. ఇలాంటి రాజకీయేతర వ్యక్తుల బెదిరింపులకు ప్రభుత్వమెందుకింత బెంబేలుపడుతున్నది?

లక్షల కోట్ల రూపాయల భారీ కుంభకోణాలు రోజుకొకటి వెలుగులోకి వస్తుంటే ప్రజల్లో పెరుగుతున్న ఏహ్యాభావం ఏదో రూపంలో వ్యక్తమయ్యే అవకాశమున్న పిలుపు యిచ్చిన ఏ వ్యక్తినయినా చూసి వణికిపోయేంతగా, పాలకులు ప్రజల నుండి వేరుపడిపోయి వున్నారు. ఆ పిలుపునందుకుని ప్రజాఉద్యమం పెల్లుబుకుతుందన్న భయంతోనూ, అది ప్రస్తుత ఆర్థిక-రాజకీయ విధానాలకు వ్యతిరేక మలుపుతీసుకుంటాయన్న భీతితోనూ పాలకవర్గాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. అందుకనే ప్రజల్లో పేరుకుంటున్న అశాంతి బ్రద్దలుకాకుండా, తామే ఆ ఉద్యమాలను నిర్వహించి లక్ష్మణరేఖ దాటకుండా చూసే పనిలో వున్నాయి. ఈ అవినీతి వ్యతిరేక ఉద్యమం అలాంటిదే. ప్రభుత్వంతో బేరసారాల తర్వాత బాబా రామ్‌దేవ్‌గారికి 'జ్ఞానోదయ'మైంది. "ఈ ఉన్నత పదవుల్లోని వ్యక్తులపై అనవసరపు దాడులు చేస్తే ప్రజాస్వామ్యం నడవటమెలాగా?" అన్న ప్రశ్నను సంధించి ప్రజలపై వదిలాడు. మరి ఈ వాదన ప్రధానమంత్రికే కాదు క్రింది స్థాయిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగికీ వర్తిస్తుంది కదా.

అదీ అసలు సమస్య. అక్రమార్జనలకు నెలవైన ఆర్థిక-రాజకీయ వ్యవస్థకు భంగం కలిగించకుండా పోరాటం సాగించాలి. ప్రజల అశాంతి బ్రద్దలై వ్యవస్థకు చేటు కలిగించకుండా కళ్ళేలువేసి నడిపించే ప్రయత్నమిది.

# కాంధమాల్ బాధితులకు న్యాయం నిరాకరణ

**2008 ఆగస్టులో** విశ్వహిందూ పరిషత్ నాయకుడిని అతని ఆశ్రమంలో హత్య చేశారనే అభియోగంతో ఒరిస్సా కాంధమాల్‌లోని క్రిస్టియన్ మతస్థులపై అమానవీయమైన, క్రూరమైన దాడి జరిగింది. విశ్వహిందూ పరిషత్‌నాయకుడిని వీరే చంపారని ఆరోపిస్తూ ఒకపద్ధతి ప్రకారం క్రిస్టియన్లను లక్ష్యంగా చేసుకొని హిందూత్వ శక్తుల ఆధ్వర్యంలో గూండాల గుంపులు ఈ దాడులను నిర్వహించారు. ఈ దాడులలో వాళ్ళు ప్రజలను చంపారు, స్త్రీలపై అత్యాచారాలు చేశారు, క్రిష్టయన్ల ఇళ్ళనన్నీ తగులబెట్టారు. ఇంకా అడ్డువచ్చిన ప్రజలనెందరినో తీవ్రంగా గాయపరిచారు. వారాల తరబడి సాగిన ఈ నీచమైన, క్రూరమైన దాడులు - యాదులపై ఫాసిస్టు నాజీలు సాగించిన అమానుష దాడులను గుర్తుజేశాయి. ప్రాణాలరచేతిలో పెట్టుకొని వేలాదిమంది ప్రజలు తమ పూర్వీకులనాటి గ్రామాలను, ఇళ్ళను, వదిలిపెట్టి తరలివెళ్ళిపోయారు. 38 మందికి పైగా ఈ దాడులలో చనిపోయారు. వేలాది మంది గాయపడ్డారు. 30 వేలమంది ప్రజలు తమ ఇళ్ళను, స్వగ్రామాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారు.

అధికార యంత్రాంగం, పోలీసులు వారాల తరబడి క్రిష్టియనులపై సాగిన ఈ దాడులను నిలువరించటంలో ప్రేక్షకులుగా ఉండిపోయారు. కాంధమాల్ బాధితులకు పునరావాసం కల్పించటానికి ఒరిస్సా ప్రభుత్వం చేపట్టిన చర్యలు నామ మాత్రమే. వాస్తవానికి కాంధమాల్ బాధితులకు న్యాయం చాలా సుదూరంలో వుంది. కాంధమాల్ బాధితులంతా ఒరిస్సాలోని షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందినవారు. వీరంతా శతాబ్దాలుగా ఫ్యూడల్ దోపిడీకి గురౌతూ దుర్భర దారిద్ర్యంలో జీవిస్తూ సంపన్న వర్గాలకు కారుచౌక శ్రమశక్తివనరుగా వున్నారు.

వీరిపై దాడులకు పాల్పడి హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు సాగించిన వందలాదిమందిపై కనీస ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్.ఐ.ఆర్) కూడా పెట్టబడలేదు. అతిపెద్ద కేసులలో అరెస్టయినవారికి వెంటనే బెయిలు లభించింది. ఈ నేరారోపణ లెదుర్కొంటూ బెయిల్‌పై బయటకొచ్చిన వారు, వారికి వ్యతిరేకంగా బాధితులు ఎవరూ సాక్ష్యాలు చెప్పకుండా బెదిరింపులకు గురిచేశారు. ఈ దాడులకు సంబంధించిన కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేయబడిన రెండు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో ముద్దాయిలు, తమకు వ్యతిరేకంగా సాక్ష్యాలు నమోదు కాకుండా చేసుకున్నారు. ఈ దాడులను దగ్గరుండి నడిపించిన ముద్దాయిల, వారి భావజాల మద్దతుదారులతో కోర్టు ఆవరణలు నిండిపోయేవి. ఈ దాడులకు పాల్పడ్డారనే నేరారోపణలపై రెండు న్యాయస్థానాలలోనూ కలిపి 26 మందికి మాత్రమే శిక్షలు పడగా ఎటువంటి సాక్ష్యాధారాలు లేవనే దానితో వందలాదిపై కేసులు కొట్టివేశారు. వారాల తరబడి సాగిన ఈ దారుణ హింసా కాండను కళ్ళప్పగించి చూస్తుండిన పోలీసు అధికారులే ఈ కేసులను పరిశోధించే అధికారులుగా కొనసాగుతుండటమనే కారణంగా సాక్ష్యాధారాలేవీ లభించక పోవటం ఆశ్చర్య కరమైనదేమీకాదు.

కాంధమాల్ బాధితులు కుదురుకునేందుకు, పునరావాసం కల్పించేందుకు ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీలేదు. కొంత మంది బాధితులకు అదీ కొద్దిమొత్తంగా మాత్రమే నష్టపరిహారం పేరిట చెల్లించారు. కోల్పోయిన తమ జీవనాన్ని పునర్నిర్మించుకోవటానికి వారికి ఇదేమాత్రం దోహదపడదు. దుర్భరంగా, అమానుషంగావున్న సహాయ పునరావాస కేంద్రాల్లో 20 వేలమందిపైగా ప్రజలు తలదాచుకున్నారు. తమతమ గ్రామాలకు బాధితులు తిరిగి వెళ్ళటమనే ప్రక్రియ కూడా చాలా అవమానకరంగా సాగుతున్నది. ఎవరైతే తమపై దాడులకు పాల్పడ్డారో ఆశక్తులకు లొంగివుండే విధంగా మాత్రమే తిరిగి గ్రామాల్లోకి ప్రవేశించే విధంగా కాంధమాల్ బాధితులు నెట్టబడ్డారు. పునరావాస కేంద్రాల చుట్టూ వ్యభిచార నిర్వాహకులు పోగై మహిళలకు, బాలికలకు అనేక తప్పుడు ఆశలు కల్పించటం ద్వారా కొందరిని లోబరుచుకొని ఢిల్లీ తదితర ప్రాంతాలకు రవాణా చేశారు.

కాంధమాల్ బాధితులకు జరిగిన అన్యాయాన్ని వెల్లడి చేసేందుకు 'నేషనల్ సాలిడారిటీ ఫోరమ్' అనే ప్రభుత్వేతర సంస్థ ఆధ్వర్యంలో 3 రోజులపాటు ఢిల్లీలో జాతీయ ప్రజాకోర్టు నిర్వహించారు. దీనిలో హిందూమతతత్వశక్తులు క్రిస్టియనులపై సాగించిన హింసాకాండపై కేంద్రీకరించి ఈ విచారణలను నిర్వహించారు. కాంధమాల్ దారుణ పర్వంలోని 43 ఘోరమైన కేసులను ఇందులో విచారించారు. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌షా ఈ విచారణలను నిర్వహించి తీర్పులను వెలువరించారు. ఈ తీర్పుల నివేదికలను భారత రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి పంపారు కూడా.

ఈ దాడులకు, దుర్మార్గాలకు బలైన క్రిస్టియన్ మత ప్రజలు ఈ నాటికీ భయంలోనే జీవిస్తున్నారనీ; హత్యకుగురైన కుటుంబాలకు, గాయాలపాలైన వారికీ ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలనీ; దాడులకు బాధ్యులైన వారిపై, పాల్పడిన వారిపై పెట్టిన కేసులను సక్రమ పద్ధతిలో పరిశోధన జరిపి పునర్విచారణ జరపాలనీ కటక్- భువనేశ్వర్‌ల కాథలిక్ ఆర్చ్‌డైకోసిస్ ఆర్చిబిషప్ డిమాండ్ చేశారు.

ఏమైనప్పటికీ కాంధమాల్ బాధితులకు పూర్తిస్థాయిలో అన్యాయం జరిగింది. ఒరిస్సా రాష్ట్రంలో ప్రతి పక్షంలో వున్న కాంగ్రెస్ పార్టీకానీ, కేంద్ర ప్రభుత్వంకానీ కాంధమాల్ బాధితుల సమస్యలను పరిష్కరించటానికి సిద్ధంగా లేవు. ప్రస్తుతకాలంలో పాలక పార్టీలకు చెందిన - క్రిందనుండి పై స్థాయిలోని నాయకులందరూ తీవ్రవాదం గురించి, దానికి వ్యతిరేకంగా పోట్లాడాల్సిన పవిత్ర కర్తవ్యం గురించి చాలా ఎక్కువగా మాట్లాడుతున్నారు. కానీ హిందూ తీవ్రవాదం సమస్య ముందుకొచ్చేసరికి నీళ్ళు నములుతున్నారు. హిందూమతతత్వ తీవ్రవాదంపై పోట్లాడితే మెజారిటీగా వున్న హిందువులు దీనిని ఎలా స్వీకరిస్తారో, ఎన్నికలలో ఓట్లు పొందుతామో, పోగొట్టుకుంటామోననే లెక్కలు వేసుకుంటున్నారు. భారత దేశంలో ఘోరమైన, అమానవీయమైన కాంధమాల్ వంటి మారణ కాండలను సృష్టించే ఒక తీవ్రవాదంగా హిందూమతత్వాన్ని గుర్తించటానికో, పరిగణించటానికోకూడా వారు నిరాకరిస్తున్నారు. ఇది లౌకిక వాదానికి మాత్రమే కాదు, మానవత్వానికే ఒక తీవ్రమైన సవాల్!

కానీ మన దేశంలోని అర్ధవలస-అర్ధఫ్యూడల్ వ్యవస్థలో పేదలకు, మైనారిటీ ప్రజలకు న్యాయమనేది కాంధమాల్‌లో వలె మోసకారితనంతో కూడుకున్నదిగానే వుంటుంది.

పేదప్రజలకు, మైనారిటీలకు ఈ ప్రభుత్వాలు న్యాయం కల్పిస్తాయని ఎవరూ భ్రమపడనవసరం లేదు. మన సామాజిక-రాజకీయ-ఆర్థిక వ్యవస్థ దానియొక్క అసమత్వ వర్గ స్వభావరీత్యానే పేద, అణచి వేయబడిన, దోపిడీకి గురయ్యేవర్గాలకు న్యాయాన్ని నిరాకరిస్తున్నది. మనదేశంలోని మెజారిటీ హిందువులకు తమను తాము ప్రతినిధులుగా ప్రకటించుకొన్న హిందూ మత ఛాందసవాద తీవ్రవాద దాడుల నుండి ఒక చైతన్యయుత ప్రజా ఉద్యమం మాత్రమే మైనారిటీలకు భద్రతను, రక్షణను కల్పించగలదు. ✡

## రైతాంగ సంక్షోభం... (మొదటి పేజీ తరువాయి)

దీనినుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆహార భద్రతా చట్టం గురించి నిరంతరం మాట్లాడుతున్నారు. వ్యవసాయరంగాన్ని పరాధీనవెునర్చే తమ దివాళాకోరు విధానాలను కప్పిపుచ్చుకునేందకు తాము సృష్టించిన సమస్యలపై తామే యుద్ధం చేస్తున్నట్లు నాటకమాడుతున్నారు. తాత్కాలిక సమస్యలుగా చిత్రించి వాటికి సర్వరోగనివారణా మంత్రాలుగా పనికిరాని పరిష్కారాలను జపిస్తూ రైతాంగాన్ని జోకొట్టు చూస్తున్నారు. రైతాంగమెదుర్కొంటున్న సమస్య వ్యవస్థాగతమైనది. విప్లవ భూ సంస్కరణలు అమలు జరగకుండా, ప్రజావసరాలు తీర్చటం లక్ష్యంగా రైతాంగానికి మద్దతునందించకుండా రైతాంగ సమస్యలు పరిష్కారం కావు. అలాంటి విధానం కొరకు రైతాంగం సంఘటితంగా పోరాడాలి. ✡

# భారతదేశంలో కార్మికుల ఆందోళనలు

## ఎయిర్ ఇండియా

ఏప్రిల్ 26 నుండి ఎయిర్ ఇండియా పైలెట్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. వారి యూనియన్‌కు గుర్తింపు నివ్వాలని, ఎయిర్ ఇండియాలో విలీనమైన ఇండియన్ ఎయిర్‌లైన్స్ పైలెట్స్‌కు కూడా ఎయిర్ ఇండియా పైలెట్లతో సమానవేతనం ఇవ్వాలని, ముందుగా నోటీసు ఇచ్చి, పూర్తిచేయవలసిన న్యాయ పరమైన నిబంధనలన్నింటినీ పూర్తిచేసి సమ్మెలోకి వెళ్ళారు. కానీ ప్రభుత్వం వారి డిమాండ్స్‌ను పరిగణలోకి తీసుకోవటానికి సిద్ధంకాలేదు. పైలెట్ల సమ్మె చట్టవిరుద్ధమని కనుక ప్రజాప్రయోజనాలరీత్యా పైలెట్లు సమ్మె విరమించి విధులలో చేరాలనే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల సాకుతో ప్రభుత్వం వారి సమ్మెను అణచివేసే ఎత్తుగడకు పాల్పడింది. కానీ దీనికి వెరవక పైలెట్లు సమ్మె కొనసాగించారు. ఎయిర్ ఇండియాకు నష్టాలు రావటానికి పైలెట్ల సమ్మె కారణమంటూ తాము అనుసరించిన దివాళాకోరు విధానాలను కప్పిపెట్టి భారతప్రభుత్వం పైలెట్లపై బురద జల్లే ప్రయత్నం చేసింది. ప్రయాణీకుల ఆగ్రహానికి గురయ్యేలా చేసి వత్తిడిని పెంచే విధానాలను అనుసరించారు. విమానాలను నడిపే సిబ్బంది, ఉద్యోగులకంటే విమానాలలో ప్రయాణించే వారి ప్రయోజనాలే అత్యంత ముఖ్యమైనవిగా చిత్రీకరించారు. సమ్మెకు నాయకత్వం వహించే 9 మంది పైలెట్లను ఉద్యోగాలనుండి సస్పెండ్ చేశారు. నిరంకుశమైన యాజమాన్య తరహాలో ప్రభుత్వం వ్యవహరించింది. ఏమైనా, లొంగకుండా పైలెట్లు సమ్మె కొనసాగించటంతో తన మూర్ఖపు పట్టుదలను విడనాడి ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ఆవిధంగా పైలెట్ల యూనియన్ల గుర్తింపును, సస్పెండ్ అయిన వారిని తిరిగి తీసుకునేందుకు, 2001 నవంబర్‌లో ధర్మాధికారి కమిటి నివేదిక ప్రకారం పైలెట్ల వేతనాలను సవరించేందుకు అంగీకరించింది.

## ఆంధ్రప్రదేశ్

ఈ - సేవా కేంద్రాలలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులు తమ వేతనాల పెంపుదలను డిమాండ్‌చేస్తూ జనవరి 25న సమ్మె చేశారు. ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధాన్ని వారు తట్టుకొని నిలిచారు. వారి ఆందోళన ఫలితంగా ఫిబ్రవరి 14 నాటికి వేతనాల పెంపు సమస్యను పరిష్కరించుకోగలిగారు.

మునిసిపాలిటీలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు రాష్ట్రవ్యాపితంగా ఫిబ్రవరి 28 నుండి మార్చి 7వరకూ సమ్మె చేశారు. వేతనాల పెంపు వారి ప్రధానమైన డిమాండ్. ఒకవారం సమ్మె తర్వాత వారి నెలవారీ కనీస వేతనాన్ని 6,700కు పెంచుతూ ప్రభుత్వం అంగీకరించింది.

రాష్ట్రవ్యాపితంగా సహకార రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు మార్చి 14నుండి నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో వున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రతను, కనీస వేతనాల అమలును, రోజ్‌గార్‌లను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా గుర్తించాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు లందరూ రాష్ట్ర వ్యాపితంగా ఫిబ్రవరి 15 నుండి నిరవధిక సమ్మె చేశారు.

గుంటూరు జిల్లా-మాచర్ల లోని ఆంధ్ర సిమెంట్ కంపెనీ దక్షిణభారత దేశంలోనే ఒక పెద్ద పరిశ్రమ. ఈ పరిశ్రమ 2010 జూన్‌లో ఉత్పత్తిని నిలిపివేసింది. వర్కింగ్ క్యాపిటల్ కొరత కారణమని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం అనేక సబ్సిడీలు, పన్నుల మినహాయింపులు కల్పిస్తున్నప్పటికీ అది ఉత్పత్తిని తిరిగి ప్రారంభించలేదు. ఈ పదినెలల కాలంగా 1500 మంది కార్మికులు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి జీవనోపాధికి మరో ప్రత్యామ్నాయమూలేదు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల సానుభూతి ఒలకబోయడం తప్ప వారి సమస్యల పరిష్కారానికి పూనుకోవడం లేదు. వేతన బకాయిలను కార్మికులకు చెల్లించేందుకు కూడా ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు.

ఆంధ్రప్రదేశ్ సినీ పరిశ్రమకు చెందిన కార్మికులు ఎపి ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7వ తేదీ నుండి సమ్మె చేపట్టారు. నిర్మాతల మండలి వీరి అసోసియేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 50 శాతం పెంపుదలతో తమ వేతనాలు చెల్లించాలని సినీపరిశ్రమకు చెందిన 25 విభాగాల కార్మికులు డిమాండ్ చేశారు. మొత్తంగా 14 వేల మంది కార్మికులు సమ్మె చేశారు. సినీ కార్మికుల డిమాండ్లు న్యాయమైనవేనని నిర్మాతల మండలి ఒప్పుకుంటూనే సినీ పరిశ్రమలోని సంక్షోభం కారణంగా చిన్న, మధ్య తరగతి నిర్మాతలు వీటిని అమలు చేయలేదని ప్రకటించింది.

## కర్నాటక

మైసూర్‌లోని ఫాల్కన్ టైరు పరిశ్రమలో పనిచేసే 300 మంది తాత్కాలిక కార్మికులు 2010 నవంబరు 4 నుండి సమ్మెచేస్తున్నారు. రెగ్యులర్ కార్మికులతో సమానంగా వారికీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమలోని 1680మంది ఉద్యోగులలో 550 మంది రెగ్యులర్ కార్మికులు, 800 మంది కాంట్రాక్టు కార్మికులు కాగా 334 మంది తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తున్నారు. ఫాల్కన్‌కంపెనీ డన్‌లప్, డోనిన్ మరియు ఫాల్కన్ రకాల టైర్లను తయారు చేస్తుంది.

**(మరిన్ని ఆందోళనల రిపోర్టులు వచ్చేసంచికలో)**

## ఐ.ఎం.ఎఫ్.... (3వ పేజీ తరువాయి)

కొత్తగా రుణం పొందే అర్హతకోసం పాకిస్థాన్ ప్రభుత్వం ఏఏ సంస్కరణలను అమలు చేయాలని తాను భావిస్తున్నదో ఐ.ఎం.ఎఫ్. ప్రకటించింది కూడా. పాకిస్థాన్ దినపత్రిక 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనంలో 'తరువాయివిడత రుణం ఐ.ఎం.ఎఫ్ మంజూరు చేసేట్లయితే, ఉద్యోగుల, కార్మికుల సంఖ్యను తగ్గించి వేయటంతో సహా ప్రభుత్వరంగ సంస్థల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన షరతులు ముందుభాగాన వుంటాయని, ఈ పరిణామాలు 2013 సాధారణ ఎన్నికలలో పి.పి.పి. సంకీర్ణానికి చేదు ఫలితాల్ని మిగులుస్తాయని అధికారులు పేర్కొన్నార'ని తెలిపింది.

ప్రైవేటీకరణకు సమాయత్తం చేసే దానిలో భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను లాభాలార్జించే దిశగా మార్పులు చేపట్టాలని ఐ.ఎం.ఎఫ్., ఇస్లామాబాద్‌కు తెలిపింది. ఇలాంటి వాటిలో-పాకిస్తాన్ అంతర్జాతీయ విమాన సర్వీసులు, రైల్వేలు, స్టీలుమిల్స్, విద్యుదుత్పత్తి సంస్థలు, పాకిస్తాన్ వాణిజ్య కార్పొరేషన్, పాకిస్తాన్ వ్యవసాయ నిల్వల, సరఫరాల కార్పొరేషన్‌లవంటివున్నాయి.

రాబోయే బడ్జెట్ సమావేశాలలో పిపిపి సంకీర్ణ ప్రభుత్వం ఐఎంఎఫ్ నిర్దేశిత సంస్కరణలను అమలు చేసేందుకు అన్ని విధాలా అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు తమ వ్యాఖ్యానాల్లో విస్పష్టంగా పేర్కొంటున్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నాయనే నెపంతో ఇప్పటికే ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలను 10 నుండి 13 శాతం పెంచివేసింది.

రుణంకోసం పాక్షికంగానే అయినా ఐ.ఎం.ఎఫ్. సంస్కరణలను అమలు చేయటమనేది ప్రజల జీవితాలపైనా, దేశ ఆర్థిక వ్యవస్థపైనా దుష్ప్రభావాన్ని చూపింది. దేశ బడ్జెట్ లోటు జిడిపిలో 3 శాతం, అంటే దాదాపు 3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దేశంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో దాదాపు సగం ఇప్పటికే తీసుకున్న 58 బిలియన్ డాలర్ల రుణం తాలూకూ తిరిగి చెల్లింపులకే సరిపోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మొదటి 9 నెలల కాలంలోనే అభివృద్ధి కొరకు సంవత్సరం కాలంలో కేటాయించిన బడ్జెట్‌కంటే ఎక్కువ మొత్తాన్ని వడ్డీలకే చెల్లించింది.

ద్రవ్యోల్బణం పెరుగుదలతో కార్మికులు, కష్టజీవులు-ఆహారం, చమురు ధరల పెరుగుదల భారాన్ని మోస్తున్నారు. గత వేసవి కాలంలో సంభవించిన వరదలు 3 బిలియన్‌డాలర్ల విలువచేసే పంటలను నష్టపరచటమనేది ఆహార కొరతకు, తద్వారా విస్తృతమైన ఆందోళనలకు దారితీసింది. ధరలు సగటున 14.2 శాతం పెరిగాయి ఈ సంవత్సరాంతానికి అది 16 శాతానికి చేరుకోనుంది. చమురు ధరల పెరుగుదల కూడా ఇంధన సంక్షోభాన్ని తీవ్రంచేసింది. విద్యుదుత్పత్తి పడిపోవటంతో రోజుకు 14 గంటల విద్యుత్ కోత విధిస్తున్నారు. ఇది ఉత్పత్తిని దెబ్బతీయటంతో పాటుగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పూర్తిగాలేదా పాక్షికంగా మూసివేయటానికి దారితీస్తోంది. పెద్ద సంఖ్యలో కార్మికులను ఉద్యోగాలనుండి తొలగించటంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. దిగజారుతున్న తమ జీవన స్థితిగతుల మెరుగుదలకై కరాచీలోనూ, ఇతర పట్టణాలు, నగరాల్లో పెద్దఎత్తున ప్రజానిరసనాందోళనలు కొనసాగుతున్నాయి. ✡

## అరబ్ దేశాలలో ప్రజావెల్లువ

# ఆధిపత్యం కొనసాగించేందుకు సామ్రాజ్యవాద కుయుక్తులు

**తూర్పున** ఎర్రసముద్రం నుండి మధ్యధరా సముద్ర దక్షిణభాగం మీదుగా పశ్చిమాన పసిఫిక్ మహాసముద్రం వరకూ విస్తరించియున్న అరబ్బు దేశాలను సామాజిక అశాంతి, దాని కొనసాగింపుగా సాగుతున్న ప్రజావెల్లువలు వణికించివేస్తున్నాయి. ఈ ప్రజావెల్లువలు ఈ ప్రాంతంలో సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాల్ చేసే వైపుగా ఎదగకుండా కట్టడి చేసేందుకు అమెరికా సామ్రాజ్యవాదులూ మరియు ఈ ప్రాంతంలో వారికి దన్నుగానున్న ప్రతీఘాతుక ప్రభుత్వాలూ తెగబడి ప్రయత్నిస్తున్నాయి.

అమెరికా అండదండలతో కొనసాగుతున్న ట్యునీసియా, ఈజిప్టులలోని నియంతృత్వ ప్రభుత్వాలను ఇస్లామిక్ శక్తులు; జాతీయవాద లౌకిక, ప్రజాస్వామిక శక్తులు కూల్చివేయగలిగేవే. ఈ రెండు దేశాల పాలకులూ తమ పరపతిని పూర్తిగా కోల్పోయి ప్రజలనుండి వేరుపడి పోయారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వారిని మార్చటం మినహా మరో మార్గాంతరం లేకపోయింది. అయినప్పటికీ తమ నమ్మకమైన బంటుల చేతుల్లోనే అధికారం వుండే విధంగా అమెరికా ఈ మార్పిడి ప్రక్రియను సాగించగలిగింది. ఈ దేశాలలో ప్రజాస్వామిక పాలన, మెరుగైన జీవన పరిస్థితులు అనే డిమాండ్లతో ప్రభుత్వాల మార్పుకై ప్రజలు సాగించే పోరాటాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్యునీసియా, ఈజిప్టు పాలకులు చేపట్టి కొనసాగించిన భయోత్పాత అణచివేత విధానాలు మరింత తీవ్రమైన ప్రజా ఉద్యమ వెల్లువకు నూతన ద్వారాలు తెరుస్తున్నాయి.

ట్యునీషియా, ఈజిప్టులో సంభవించిన పరిణామాలతో అమెరికా సామ్రాజ్యవాదం ప్రతిఘటన సాగిస్తున్న ఇస్లామిక్ శక్తులలోనూ; జాతీయ, లౌకిక, ప్రజాస్వామిక శక్తులలోనూ ఈ ప్రాంతంలో అమెరికా అధిపత్యాన్ని వ్యతిరేకించిన గత లిబియా, సిరియాల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆ రెండు విభాగాల లోనూ–మోసకారితనంతో చీలిక కల్పించే ప్రయత్నం సాగిస్తున్నది. లిబియా, సిరియా దేశాలు వారెంచుకున్న పెట్టుబడిదారీ అభివృద్ధి చర్యల కారణంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. పెట్టుబడిదారీ సాధారణ సంక్షోభం మరియు సామ్రాజ్యవాద దాడులూ, రాజకీయంగానూ కొన్నిసార్లు సైనికంగానూ, మరోవైపున కొనసాగే ఆర్థిక ఆంక్షల నడుమ ప్రతికూల వాతావరణంలో తమ మనుగడకోసం సామ్రాజ్యవాదంతో వారు చేసుకున్న రాజీల ఫలితంగానూ–ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. లిబియాపై అమెరికా లేదా నాటో బలగాల బాంబు దాడుల ద్వారా ఆ దేశాధ్యక్షుడు గఢాఫీని భౌతికంగా నిర్మూలించేందుకు, ఆ దేశాన్ని సంపూర్ణంగా ఆక్రమించేందుకు నిశ్చయించుకున్నదని ప్రపంచానికి వెల్లడైంది. సామ్రాజ్యవాదులు లిబియాలోని పుష్కలమైన చమురు వనరులపైనేగాక, లిబియా పైననే వారి ఆధిపత్యాన్ని ప్రతిష్ఠించేందుకూ, ఈ ప్రాంతంలో పెరుగుతున్న ప్రజా ఉద్యమాలను అణచివేసే స్థావరంగా చేసేందుకు లిబియాపై తీవ్రయుద్ధాన్ని కొనసాగిస్తున్నారు.

లిబియా, సిరియా–రెండు దేశాలూ సోషలిస్టు దేశాలుకావు. రెండు దేశాలూ సామ్రాజ్యవాదం యొక్క ఆంక్షలకు గురైనవే. తమ ఉనికి కోసం రెండుదేశాలూ వారితో కొంత రాజీ పడ్డవే. ఇరు దేశాలూ తమ దేశాలలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు, బహుళజాతి సంస్థల పరం చేసేందుకు సిద్ధమైనవే. అలానే సామాజిక సంక్షేమ నిధులలో ఇరుదేశాలూ కోతలు విధించినవే. అయినప్పటికీ లిబియా అధినేత గఢాఫీ, సిరియా అధినేత బషార్ అల్ అసబ్‌లు ఇరువురూ విస్తారమైన ప్రజల మద్దతును కలిగివున్నారు.

మరోవైపున రెండు దేశాలలోనూ 'ప్రజాస్వామ్య' ప్రతిపక్షాలుగా పేర్కొంటున్నవి, అమెరికా సామ్రాజ్యవాద ప్రాపకంలోనివే. తాము అధికారంలో ఉండగా ప్రజా ఉద్యమాలను క్రూరంగా అణచివేసిన రాజకీయ నాయకులు, ముస్లిమ్‌ఛాందసవాదులు లిబియాలోని ప్రతిపక్ష శక్తులుగా వున్నారు. ప్రపంచబ్యాంకు నిర్దేశిత సంస్కరణ కార్యక్రమాలకు రెండు దేశాలూ మద్దతుగావున్నవే. 'సిరియాలో ప్రతిపక్ష గ్రూపులకు రహస్యంగా అమెరికా సహకారం' పేరుతో ('వాషింగ్టన్‌పోస్టు' ఏప్రిల్ 18వ తేదీ) క్రెయిద్ విట్‌లాడ్ వ్రాసిన వ్యాసంలో అమెరికా విదేశాంగ శాఖకు సంబంధించి వికీలిక్స్ వెల్లడి చేసిన వివరణాత్మకమైన సమాచారం అందజేశారు. సిరియన్ రాజకీయ ప్రతిపక్ష గ్రూపులకు ఉపగ్రహ సమాచార వ్యవస్థ ద్వారా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్ని దేశంలోకి జొప్పించటంతో సహా రహస్యంగా నిధులు సమకూరుస్తున్న విషయాన్ని కూడా ఈ వ్యాసం వెల్లడి చేసింది.

దశాబ్దాలపైగా సాగుతున్న పాలస్తీనీయుల ప్రతిఘటనకు సమర్ధనగా నిలవటం; జియోనిస్టుల ఆక్రమణను గుర్తించ నిరాకరించటం కారణంగా, సిరియా సామ్రాజ్యవాదులకు కంటగింపైంది. లెబనాన్‌ను దురాక్రమించిన ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హిజ్‌బుల్లా సాగించే పోరాటంలో సిరియా వారికి మద్దతుగా సహకరించటం సిరియాపై సామ్రాజ్యవాదుల ఆగ్రహానికి కారణమైంది. ఇజ్రాయిల్‌తో సంబంధంలేని అతికొద్ది అరబ్ దేశాలలో సిరియా ఒకటి. అరబ్ సోషలిస్టు బాత్‌పార్టీ పాలనలో సిరియా ఖచ్చితమైన లౌకిక వాద దేశంగావుంది. సిరియాలో అన్ని మతాలకు మత స్వేచ్ఛ వుండడంతో పాటుగా ఒక మత సమూహం మరొక దానిపై ఆధిపత్యం వహించడమో లేదా రాజ్యమే ప్రోత్సహించటమన్నదో లేదు.

సిరియా ఒక సోషలిస్టు దేశం కాదు. బషర్‌ఆల్ అసద్ పెట్టుబడిదారీ పంథానెంచుకున్నాడు. సంవత్సరాలుగా సాగుతున్న అమెరికా ఆంక్షలు ఆర్థిక సమస్యలను పెంచివేశాయి. గడిచిన 63 సంవత్సరాలుగా 5 లక్షలకు పైగా పాలస్తీనా కాందిశీకులను, వారి వారసులను భరించటం సిరియాకు అదనపు భారంగానే వుంది. కానీ వీరి పొరుగునవున్న మరే ఇతర దేశం కంటే కూడా సిరియా స్థితిగతులు మెరుగ్గానే వున్నాయి. కారణమేమంటే జోర్డాన్, లెబనాన్‌లలోవలె కాకుండా సిరియా తన దేశ ప్రజలతో సమానంగా కాందిశీకులైన పాలస్తీనీయులకు కూడా వైద్య సౌకర్యం, విద్య, గృహవసతులను కల్పించింది.

సిరియా పొరుగుదేశమైన ఇరాక్‌పై అమెరికా సాగించిన అతిపెద్ద దురాక్రమణ, తీవ్ర విధ్వంసం కారణంగా 15 మిలియన్ల జనాభా మాత్రమే ఉన్న సిరియాలోకి పెద్దసంఖ్యలో కాందిశీకులు ప్రవేశించారు. (ప్రస్తుతం సిరియాలోని కాందిశీకుల సంఖ్య 2 మిలియన్లు) కాందిశీకులకు సంబంధించిన అమెరికా హై కమీషనర్ 2007లో విడుదల చేసిన నివేదిక ప్రకారం నిరాశా నిస్పృహలతో రోజుకు 2 వేలమంది చొప్పున ఇరాకీయులు సిరియాలోకి ప్రవేశించటమనేది సిరియా దేశపు అన్ని విభాగాలపై ముఖ్యంగా సిరియన్ ప్రభుత్వం తమ పౌరులతో సహా కాందిశీకులకూ అందించే సేవలపై ప్రభావం చూపింది. ప్రభుత్వం గ్యారంటీ చేసిన ఉచిత స్కూలువిద్య, ఉచిత వైద్యసౌకర్యం, గృహవసతి లభ్యత మాత్రమే కాక ఇతర ఆర్థిక పార్శ్వాలపై కూడా పెద్ద ఎత్తున ఇరాకీ కాందిశీకుల రాక తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. ఇది ధరల పెరుగుదలకు దారితీసింది. ఆహారపదార్థాల, కీలక సరుకుల ధరలు 30 శాతం పెరిగి పోయాయి. ఆస్తుల విలువలు 40 శాతం, ఇళ్ళ అద్దెలు 150 శాతంగా పెరిగిపోయాయి. సిరియన్ ప్రభుత్వం అందరికీ సబ్సిడీలపై కల్పించే గ్యాస్, ఆహారం, మంచినీరు మరియు ఇతర అత్యవసర సరుకుల భారం పెరిగిపోయింది. ఇంతపెద్ద సంఖ్యలో ఒక్కసారిగా నిరుద్యోగులు పెరిగి పోవటంతో, అది వేతనాల తగ్గుదలకు దారి తీసింది, ఉద్యోగాల కొరకు పోటీని తీవ్రం చేసింది. (మిడిల్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్–కాందిశీకులపై నివేదిక, 10–12–2010)

అమెరికా ఇరాక్‌పై సాగించిన యుద్ధం కారణంగా 24 శాతం ఇరాకీ ప్రజలు విస్తాపనకు గురై సిరియాలోకి కాందిశీకులుగా రావటం, సిరియాలో కాందిశీకుల సంక్షోభాన్ని సృష్టించింది. అయినా ఇప్పటికీ అమెరికా ప్రభుత్వపు బ్యాంకు ఖాతాలున్న వారినే అనుమతి నిస్తున్నది. మరోదిక్కులేని కాందిశీకులను అనుమతించదు. ఐక్యరాజ్య సమితి సహాయనిధికి ఈ దేశం అతితక్కువ నిధిని మాత్రమే అందిస్తున్నది. అది అందించే విరాళాన్ని కూడా ఐక్యరాజ్య సమితిని లోబరుచుకునే సాధనంగా ఉపయోగిస్తున్నది. ఐ.ఎం.ఎఫ్ సూచనల మేరకు 2006 నుండి వేగవంతమైన ఆర్థిక సంస్కరణల అమలుతో సిరియాలో క్రమంగా దిగజారుతున్న సామాజిక స్థితిగతులు, కాందిశీకుల సమస్యతో మరింత తీవ్రమయ్యాయి. ఐ.ఎం.ఎఫ్. యొక్క 'ఆర్థికఔషధం'లో పొదుపు చర్యలు, వేతనాల నిలుపుదల, ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తమొనర్చటం, వ్యాపార సంస్కరణలు మరియు ప్రైవేటీకరణ అనే చర్యలు వున్నాయి, ఇదంతా సామాజిక అలజడి, ఆందోళనలకు దారితీసింది. ప్రభుత్వ అనుకూల ప్రదర్శనల పలు వీడియోక్లిప్పింగులు, ఫోటోలను పశ్చిమ దేశాల మాధ్యమాలు పూర్తి స్థాయిలో వక్రీకరించి బయట ప్రపంచానికి ఫోకస్ జేయటంలో తలమునకలై వున్నాయి. సామ్రాజ్యవాద మాధ్యమాలు అంతర్జాతీయంగా ప్రజల అభిప్రాయాలను తమకనుకూలంగా ప్రభావితం చేసేందుకు పూనుకున్నాయి. (ప్రొఫెసర్ మైఖేల్ ఛసుడోవస్కీ 2–5–2011) ముఖ్యంగా మధ్య ప్రాచ్య పరిణామాలపై అనేక ప్రత్యేక రాజకీయ విశ్లేషణలలో గమనించినదేమంటే అమెరికా ఆక్రమణ ప్రమాదాలపట్ల, దేశాన్ని అస్థిరీకరణకు గురిచేసే దాని స్వభావంపట్ల సిరియా ప్రభుత్వంలో, ప్రజలలో చైతన్యం పెరిగింది. (సారా ఫ్లండర్, గ్లోబల్ రీసెర్చి 6–5–2011)

సిరియా ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో నిరంకుశంగా కూడా వ్యవహరించి ఉండవచ్చు. కానీ తమ సమస్యను పరిష్కరించుకోవలసింది సిరియన్ ప్రజానీకమే. 'దేశభక్తియుతచట్టం' పేరిట, 'చిత్రహింసల నిరోధక చట్టం' పేరిట పౌరహక్కుల కాలరాచివేతలో అమెరికా ఎలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నదో ఎవరికీ తెలియనిదికాదు. ఇక అదిసాగించిన 'మానవత్వ యుద్ధాల' గురించి ప్రత్యేకంగా పేర్కొనాల్సిన అవసరం లేదు. సమీప భవిష్యత్తులో అమెరికా లేదా నాటో దళాల సైనిక జోక్యం లేకపోయినప్పటికీ 'పాలనలో మార్పు' నినాదమిస్తున్న ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలకు కుట్రపూరిత మద్దతునందించటం ద్వారా సిరియాలో రాజకీయ అస్థిరతను, వేర్పాటువాద హింసను ప్రజ్వరిల్ల చేయటమే అమెరికా సామ్రాజ్యవాద అంతిమ లక్ష్యంగాఉంది. ఏమైనా, ఇప్పటికీ సిరియా, వాషింగ్టన్–టెల్ అవీవ్‌ల సైనిక దాడి లక్ష్యాలలో ఒకటిగావుంది.

సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని వ్యతిరేకించే దేశాలలో 'ప్రజాస్వామిక' మార్పు గురించి బోధిస్తూనే మరోవైపున అరబ్ దేశాల్లో అత్యంత అసహ్యించుకోబడిన నిరంకుశ పాలకులకు అమెరికా నగ్నంగా మద్దతుగా నిలుస్తున్నది. జోర్డాన్, కువాయిట్, బెహరైన్, యు.ఏ.ఇ, సౌదీ అరేబియాలను కృత్రిమంగా దేశాలుగా బ్రిటన్ ఏర్పరిచింది. తెగల నాయకులకు అధికారం కట్టబెట్టి రాజులుగా ప్రకటించింది. వీరు నిరంకుశ పాలనతో ప్రజాభిమానాన్ని పూర్తిగా కోల్పోయారు. వారికి వ్యతిరేకంగా ప్రజానిరసనలు ఎక్కుపెట్టబడ్డాయి. సైనికబలగాల మోహరింపు, ఈ ప్రాంతంలో తన సైనిక స్థావరాల ఏర్పాటుతో సహా అమెరికా ఈ ప్రాంతంలో పెల్లుబుకుతున్న ప్రజా నిరసనలను అణచివేయటానికి తన పూర్తి సహాయాన్ని అందజేస్తున్నది. ఇదేవిధంగా మొరాకోలో కూడా ప్రజల నిరసనల నేపథ్యంలోనే అమెరికా సహకారంతో నడుస్తున్న రాజకీయ పక్షాలు కింగ్‌మహమ్మద్ IV ప్రకటించిన నిస్సారమైన సంస్కరణలను పొగుడుతున్నాయి. ప్రజా ఉద్యమాల వత్తిడితో బలహీనమైన యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా అమెరికా తన బలగాలను పంపింది.

లిబియా, సిరియాల్లో సాగుతున్న నిరసన ఉద్యమాలను శాంతియుతమైనవి గానూ, అదే సమయంలో ఇతర అరబ్ దేశాలలో సాగుతున్న ప్రజానిరసనలను అరాచక, తీవ్రవాద, హింసాత్మకమైనవి గానూ చిత్రీకరింటమనేది అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకనుగుణంగా సాగుతున్నదే. లౌకికవాద వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించేందుకు, ఉగ్రవాద వ్యతిరేకత, ఛాందసవాద వ్యతిరేకత పేరిట ఈ శక్తులను వెనకేసుకు రావడమనేది అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసమే.

కావున, వాస్తవాలను మరుగుపరచి సామ్రాజ్యవాద నియంత్రిత ఫేస్‌బుక్‌లు, ట్విట్టర్‌లు, యూట్యూబ్‌ల వంటి వాటిద్వారా అల్లబడిన అబద్ధాలే వాస్తవాలుగా చెలామణి అయ్యే ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికవర్గ ఉద్యమం వర్గ దృక్పథం ప్రాతిపదికపై మొత్తం పరిస్థితిని విశ్లేషించాలి. అమెరికా సామ్రాజ్యవాదం ఏదేని దేశంలోని ప్రభుత్వం లేదా ప్రజా ఉద్యమాలపై దాడులకు పాల్పడేటట్లయితే దానిపై తటస్థవైఖరి తీసుటకోవటమనేది పిరికి చర్య అవుతుంది. మనమంతా స్థిరంగా ఈ పరిస్థితిని ఎదుర్కోవటానికి 'నీవు ఎటువైపు నిలబడివున్నావు' అనే దానిని మరలామరలా వివరించాల్సి వుంటుంది. ఇదే వర్గపోరాట విప్లవ సిద్ధాంతమైన మార్క్సిజం యొక్క 'ఓనమాలు'! ✡

## పాకిస్తాన్ ఐ.ఎం.ఎఫ్. ఆదేశిత షరతులకు లొంగుబాటు

**2008లో** పశ్చిమదేశాలలో సంభవించిన ఆర్థిక సంక్షోభ కాలంలో పాకిస్థాన్‌కు 11 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు ఐ.ఎం.ఎఫ్. అంగీకరించింది. పెట్రోలియం ఉత్పత్తులపై, సహజవాయువు, విద్యుత్‌లపై అన్ని విధాలైన సబ్సిడీలను తొలగించటం, దేశ వ్యాపితంగా పన్నులు పెంపు చేయటమనే షరతులను ఐ.ఎం.ఎఫ్., ప్రభుత్వంపై రుద్దింది. పాకిస్తాన్ పీపుల్స్‌పార్టీ ప్రభుత్వం ఈ షరతులను అమలుచేసి ఐదువిడతలుగా 2008లో దాదాపు 7.25 బిలియన్ల రుణం పొందింది. ఫలితంగా 15 శాతం ద్రవ్యోల్బణంతో ఆర్థిక స్థితి మందగింపుతో పాకిస్థాన్ ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా క్షీణించాయి. గత సంవత్సరం ఘోర విధ్వంసం సృష్టించిన వరదలు పాకిస్థాన్ ప్రజల జీవితాలను మరింతగా దిగజార్చాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ఐ.ఎం.ఎఫ్. షరతులను ప్రత్యేకించి – పన్నుల పెంపుదలవంటి వాటిని సంపూర్తిగా అమలు చేయలేక పోయింది. దీనికి–పార్లమెంట్‌లో అధికారపార్టీకి తగినంత ఆధిక్యం లేకపోవటమొక కారణమైతే, ఈ షరతులను అంగీకరించినట్లు కన్పించేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధంగాలేక పోవటం మరోకారణం.

ఈ పరిస్థితులలో పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్‌ఆలీజర్దారీ పన్నుల పెంపుచేస్తూ, పాకిస్తాన్ సంక్షేమ నిధినుండి 120 బిలియన్ రూపాయల కోత విధిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేశాడు. ఆదాయపన్నుపై 15 శాతం సర్‌ఛార్జీ విధింపు; ఎరువుల, పురుగుమందుల, ట్రాక్టర్ల ధరలను తీవ్రంగా ప్రభావితం చేసే సాధారణ అమ్మకం పన్నుపై 17 శాతం రాయతీల తగ్గింపు; పంచదారపై 8 శాతం అమ్మకంపన్ను; పరిశ్రమ యంత్రాలు, విడిభాగాలపై పన్ను మినహాయింపుల తొలగింపు వంటి చర్యలు వీటిలో వున్నాయి.

ఈ చర్యలు చేపట్టిన అనంతరం, జర్దారీ ఐ.ఎం.ఎఫ్. వద్దకు వెళ్ళి 6వ విడత రుణాన్ని విడుదల చేయమనటంతో పాటు మూడు బిలియన్‌ల రుణాన్ని కొత్తగా మంజూరు చేయవలసిందిగా కోరాడు. తమ షరతులను అమలు చేయటంలో పాకిస్తాన్ ప్రభుత్వపనితీరు నాసిగా వుందన్న సాకును జూపి పాకిస్తాన్ విజ్ఞప్తిని ఐ.ఎం.ఎఫ్. నిరాకరించింది. గతంలో అంగీకరించిన షరతులన్నింటనీ పూర్తిస్థాయిలో అమలు చేసేంతవరకూ కొత్తగారుణం మంజూరు చేయటమనే ప్రశ్నేలేదని స్పష్టం చేసింది. 2008–09 కాలంలో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ ప్రభుత్వం బ్యాంకుల ప్రైవేటీకరణ, పన్నుల పెంపుదల, విదేశీ మార్కెట్‌ల సరళీకరణ వంటి వ్యవస్థాగత సంస్కరణలను చేపట్టిందని ఐ.ఎం.ఎఫ్. పేర్కొంటూనే మరికొన్ని షరతులను అమలు చేయకుండా నిలిపి వేసిందని పేర్కొంది. ప్రత్యేకంగా–ఈ సంవత్సరం ప్రారంభంలో 10 శాతం పెట్రోలియం ధరలును పెంచుతున్నట్లుగా ప్రకటించి, ప్రజల నిరసనలకు, వత్తిడికి తలొగ్గి దీనిని పూర్తిగా వెనక్కుతీసుకోవటాన్ని ఐ.ఎం.ఎఫ్. తప్పుపట్టింది.

అమెరికా, నాటో మిత్రపక్షాల ఆధిపత్యంలోని ఐ.ఎం.ఎఫ్. రుణమంజూరుకు నిరాకరణ రాజకీయ వత్తిడుల కారణంగా జరిగింది. అమెరికా అధ్యక్షభవనం, కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో పాకిస్తాన్ ఈశాన్య ఆదివాసీ ప్రాంతాల్లో తన చొరబాటు ఉద్యమంపట్ల తగినంత దూకుడుగా లేదని మండిపడింది. వాస్తవానికి పాకిస్తాన్‌సైన్యం లక్షలాదిమందిని విస్తాపనకు గురిచేసే క్రూరమైన చర్యలను చేపట్టింది.

(తరువాయి 2వ పేజీలో)

# మనదేశ కార్మికవర్గం ఎదుర్కొంటున్న సవాళ్ళు

**సమసమాజ** స్థాపనకోరకు ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గం సలిపే పోరాటాల్లో మేడే-ఒక మైలురాయి. ఎనిమిది గంటల పనిదినాన్ని లేవనెత్తటం ద్వారా, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం సమరశంఖాన్ని పూరించింది. కావున మేడేని పాటించట మంటే పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా గొంతెత్తటమే. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకోసం నిరంతరాయంగా సాగే రాజకీయపోరాటాలకు ప్రతీకగా కా॥ లెనిన్ 'మేడే'ను పరిగణించారు. లెనిన్ విశ్లేషణ ప్రకారం సోషలిజం విజయం కోసం కార్మికవర్గం ఒకవర్గంగా సంఘటితమై సాగించవలసిన పోరాటానికి మేడే ఓ సూచిక!

## 8 గంటల పనిదినం సాధనకు పోరాటం

మనదేశంలో కార్మికులు 1877లోనే పనిగంటల నినాదాన్ని లేవనెత్తారు. బొంబాయి జౌళికార్మికుల సమ్మెకు నాయకత్వం వహించిన తిలక్ అరెస్టును నిరసిస్తూ 1908లో మన దేశంలో కార్మికవర్గం మొదటిసారిగా సాధారణ సమ్మె నిర్వహించటం ద్వారా రాజకీయ చర్యకు పూనుకున్నారు. 1923లో మద్రాసులో కా॥ సింగారవేలు శెట్టియార్ నాయకత్వంలో మొదటిసారి కార్మికులు 'మేడే' నిర్వహించారు. కా॥ లెనిన్ పేర్కొన్న విధంగా అన్ని విధాలైన దోపిడీ, అణచివేతలకు, నిరంకుశత్వాలకు వ్యతిరేకంగా సాగించే పోరాటాలకు ఈ తొలి 'మేడే' నిర్వహణ, సూచికగా నిలుస్తుంది.

బ్రిటీష్ వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాల ఫలితంగా ఫ్యాక్టరీ చట్టాన్ని సాధించుకోగలిగారు. పెట్టుబడిదారీ పారిశ్రామిక యజమానులు-బాల కార్మికులు, కార్మికులు, కార్మిక మహిళల పట్ల సాగించే అమానవీయ దోపిడీని కట్టడి చేసి, రోజులో లెక్కకు మించిన గంటల చాకిరీ స్థానంలో 'పనిదినం' అనేదాన్ని ఈ చట్టం నిర్వచించింది. 1945 నవంబర్ 27, 28 తేదీల్లో జరిగిన 7వ అఖిల భారత కార్మికసదస్సు సూచనల మేరకు ఆ సంవత్సరంలోనే పరిశ్రమలలో 8 గంటల పనిదినమనే దాన్ని ఆమోదించారు.

1948లో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ ఆమోదించిన తీర్మానం, పరిశ్రమలలో ఒక వారంలో పనిగంటలను 48 నుండి 40కి తగ్గించాలని సూచించింది. కానీ, భారతదేశంలో ఈ విధమైన పనిగంటల తగ్గింపుకు చర్యలేమీ తీసుకోలేదు. 1966లో జాతీయ లేబర్ కమీషన్ సిఫార్సుల మేరకు భారీ రసాయన పరిశ్రమల్లోనూ, తీవ్ర ప్రమాదకర పరిశ్రమల్లోనూ ఒక వారంలో పనిగంటలు 48 నుండి 40కి తగ్గించాలని, 6-దినాల వారం కాకుండా 5-దినాల వారంగా కుదించాలని సూచించింది. ఈ కమీషన్ ప్రత్యేకంగా పై పరిశ్రమలలో రాత్రివేళల పనిగంటలను కుదించాలని నొక్కి చెప్పింది. కానీ ఈ నాటికీ వారానికి పనిగంటలు 48 నుండి 40కు తగ్గించటం కానీ, వారంలో 5 రోజుల పని కానీ 'స్వతంత్ర' భారతదేశంలో అమలులోకి రాలేదు.

## కార్మికవర్గ ఉద్యమంలో అన్యవర్గ ధోరణులు

అధికారమార్పిడి తదనంతర కాలంలో భారతదేశంలో కార్మికవర్గం, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా సోషలిజాన్ని సాధించేదిశగా సాగించే పోరాట తత్వాన్ని క్రమంగా కోల్పోతూ వస్తున్నది. కార్మికవర్గ ఉద్యమంలోకి ప్రవేశించిన అనేకరకాల కార్మికవర్గేతర, రాజకీయ రహిత ధోరణిలే దీనికి కారణం. భారతదేశానికి స్వాతంత్ర్యంగా చెప్పబడే 63 సం॥ల తర్వాత, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రాజీలేకుండా పోరాడాలన్న 125 సం॥ల 'మేడే' తర్వాత కూడా భారత కార్మికుల, కార్మికవర్గ పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది. గతకాలంలో ఎన్నో తీవ్రమైన పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను, అన్ని విధాలైన సౌకర్యాలను క్రమంగా కోల్పోవటం జరుగుతున్నది.

మేడే సందర్భంగా గతాన్ని సమీక్షించుకొని, పోరాటాలను తీవ్రతరం చేయాలంటే, సోషలిజం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతిన తీసుకోవాలంటే ప్రస్తుతం మన దేశంలో కార్మికవర్గ పరిస్థితులను అంచనా వేసుకొని, నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించుకోవటం తప్పనిసరి అవసరం.

నూతన సరళీకరణ ఆర్థిక విధానాలు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దోపిడీ విధానాల అమలుతో పెట్టుబడిదారీ దోపిడీ తీవ్రం చేసేందుకు, కార్మికుల హక్కులపై పెద్దఎత్తున దాడి చేసేందుకూ బడాబూర్జువా వర్గప్రయోజనాలకు ఊడిగంచేసే భారత ప్రభుత్వం మరియు పాలకులు ఒక అనుకూలమైన వాతావరణాన్ని కల్పించారు. ఒక పద్ధతి ప్రకారం ఈ విధంగా మనదేశంలో కార్మికుల హక్కులు, సౌకర్యాలపై సాగించిన దాడుల ఫలితంగా కార్మికవర్గం తన సరియైన వర్గదృక్పథ కోణంలో ఉద్యమాలను ముందుకు కొనసాగించలేక పోయింది. నయాఉదారవాద ఆర్థిక సంస్కరణలను తీవ్రం చేస్తున్న ప్రభుత్వాలు పాలకులు కార్మికవర్గం చట్టబద్ధంగా సాధించుకున్న హక్కులు, సౌకర్యాలన్నింటినీ పూనుకొని రద్దుచేశారు. అంతేకాదు, కార్మికుల హక్కులపై జంకుగొంకు లేకుండా విరుచుకుపడేందుకు బడా పెట్టుబడిదారులకు అన్ని విధాలైన అనుమతులూ ఇచ్చివేశారు.

2010 సం॥లో మన దేశంలో అనుసరించిన పారిశ్రామిక విధానాలకు సంబంధించిన సమాచార పత్రాన్ని ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ సమాచారాన్ని పరిశీలిస్తే, భారతదేశంలో కార్మికవర్గం తన పనిపరిస్థితుల, జీవన పరిస్థితుల మెరుగుదల కోసం పోరాట మార్గాన్ని అనుసరించటానికి బదులుగా ఏ విధంగా అచేతనంగా నిలిచిపోయిందో అర్థమౌతుంది. గత 12 సం॥లుగా ద్రవ్యోల్బణం పెరుగుతూండగా పారిశ్రామిక కార్మికులు తమ హక్కులపై, సౌకర్యాలపై బడా బూర్జువావర్గం సాగించే వివిధ రకాల దాడులపట్ల మరింతగా, మరింతగా స్తబ్దుగా ఉండి పోవటమనేది ఇక్కడ పేర్కొనదగింది.

1970లలో కార్మికుల సమ్మెలు లేదా లాకౌట్ల వంటి పారిశ్రామిక వివాదాల సంఖ్య సగటున రోజుకు 7 వుండగా; ఈ సంఖ్య 1980లలో 6 గానూ, 90లలో 4 గానూ, 2000-09 కాలంలో 2 కంటే తక్కువగానూ, 2010లో రెండురోజులకు ఒకటిగానూ నమోదయ్యాయి. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం రేటు (పారిశ్రామిక కార్మికుల నిత్యావసర సరుకుల ధరలలో పెరుగుదల) 12శాతం పైగావుంది. భారత దేశంలో తనపై సాగుతున్న హక్కుల ఊచకోతలకు, బడాబూర్జువావర్గ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గపు అచేతన పాత్రకు ఇది స్పష్టమైన సూచికంగా వుంది. కార్మికవర్గ నాయకత్వాన భారతదేశంలో సోషలిజం స్థాపించబడాలని ఆ విధమైన చారిత్రక పాత్రను కార్మికవర్గం నిర్వహించాలని ఆకాంక్షించే వారికి ఈ పరిణామాలు ఆందోళనకరంగా వున్నాయి. 2010లో 91 పారిశ్రామిక వివాదాలలో 3 లక్షల 30 వేల మంది కార్మికులు పాల్గొన్నారని, 16.7 దినాలు మాత్రమే కోల్పోయారనే సమాచారమే, భారత కార్మికోద్యమ దయనీయస్థితిని తెలుపుతున్నది. భారత ప్రభుత్వ, పాలకుల తోడ్పాటుతో భారత బడాబూర్జువా వర్గం ఎంత దారుణంగా కార్మిక హక్కులను కాలరాచి వేస్తున్నదనే దానికి ఇది ఓ సూచిక.

## కార్మిక హక్కుల ఉల్లంఘనకు అధికంగా పాల్పడుతున్నది ప్రభుత్వమే

స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దాలలో ప్రభుత్వం కనీసం 'సంక్షేమరాజ్యం'మనే పోజునన్నా కలిగివుండేది. చట్టప్రకారం కొన్ని హక్కులను కనీసం పబ్లిక్ రంగస్థలలోనైనా కల్పించటం, కార్మిక చట్టాలను రూపొందించి చట్టప్రకారం వ్యవహరిస్తున్నట్లుగానైనా కనిపించేది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల అమలుకు బాహాటంగా పూనుకున్న తర్వాత ప్రభుత్వం తన ముసుగును కూడా తొలగించివేసింది. అప్పటివరకు కార్మిక చట్టాలద్వారా కనీసంగానైనా కాపాడబడిన ప్రభుత్వ ఉద్యోగస్తులను పెద్దఎత్తున తగ్గించివేసి ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ రంగ సంస్థలలో ఔట్‌సోర్సింగ్ ద్వారా, కాంట్రాక్టు కార్మికులతో నింపే విధానాలను అమలు చేసింది. ప్రభుత్వ మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో ఏ విధమైన రక్షణలూ లేని క్యాజువల్, రోజువారీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు,ఉద్యోగులు పెద్ద ఎత్తున పెరిగి పోయారు. ఈ రోజు పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగులలో 32 శాతం కాంట్రాక్టు ఉద్యోగులు కాగా, ప్రైవేటు రంగంలో వీరి సంఖ్య 30 శాతం మాత్రమే. ఉద్యోగ భద్రతతో సహ ఏ విధమైన హక్కుల రక్షణా లేని కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం సృష్టించింది. ఈ విధంగా ప్రభుత్వమే అతిపెద్ద కార్మిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడేదిగా తయారైంది.

## పెట్టుబడి వికేంద్రీకరణ పేరుతో ప్రభుత్వ సంస్థల అమ్మకం

నయాఉదారవాద ఆర్థిక విధానాల ఆజ్ఞలను శిరసావహించడంలో భాగంగా భారత ప్రభుత్వం పద్ధతి ప్రకారం ప్రభుత్వ రంగసంస్థలను నిర్వహించే తన బాధ్యతలనుండి తప్పుకుంటూ తప్పుడు విధానాలతో వాటిని ప్రైవేటీకరిస్తున్నది. పైగా 'షేర్ హోల్డర్ పునాది విస్తరణ', 'ప్రజాయాజమాన్యం' వంటి ఆకర్షణీయమైన నినాదాలతో ప్రజలను మోసం చేస్తున్నది. పెట్టుబడి ఉపసంహరణ విధానాల ద్వారా ప్రభుత్వం, పబ్లిక్ రంగ సంస్థల షేర్లను అమ్మటం, పబ్లిక్ రంగసంస్థల యాజమాన్యాలను మార్పులు చేయటం వంటి చర్యల ద్వారా బాల్కో, హిందుస్థాన్ జింక్, బిఎస్ఎన్ఎల్, ఐపిసిఎల్, జెస్సోప్‌కో, పరదీప్ ఫాస్ఫేట్, మోడరన్ ఫుడ్స్ల వంటి సంస్థలను క్రమంగా ప్రైవేటుపరం చేస్తున్నది. ఇదేదో పబ్లిక్‌రంగ షేర్లను, యాజమాన్యాన్ని బహుళజాతి పరిశ్రమలపరం చేయటం మాత్రమేకాదు. విక్రయించ బడిన ప్రభుత్వ రంగసంస్థల ఆస్తులు- భారతప్రజలకు చెందవలసిన జాతీయ సంపదను కూడా ప్రైవేట్ బడా బూర్జువా వర్గానికి పరోక్షంగా కట్టబెడుతున్నారు. ఉదాహరణకు వియస్ఎన్ఎల్‌లో భారత ప్రభుత్వ అజమాయిషీలోని 770 కోట్ల విలువైన భూములు గత 9 సం॥లుగా 'టాటా'ల ఆధీనంలో వున్నాయి. వీటిని టాటాలూ తిరిగి ఇవ్వరు, భారత ప్రభుత్వమూ తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలని భావించదు. ఈ రోజున తమ ఆధీనంలో ఉన్న ఆ భూముల గురించి న్యాయస్థానాల్లో వివాదాన్ని లేవనెత్తి, దశాబ్దాల తరబడి సాగదీసి, ఈ వివాదం పరిష్కారం దాకా విలువైన ఆ భూములను తమ ఆధీనంలోనే వుంచుకుంటారు. ప్రభుత్వ రంగ సంస్థల వ్యూహాత్మక విక్రయానికి సాగిస్తున్న క్రమాన్ని వేగవంతం చేసే దానిలో భాగంగా టైర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేపా కాగిత పరిశ్రమల వంటి రబ్బరు, పేపరు పరిశ్రమలను ప్రైవేటు బడాబూర్జువాలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం భూమికను సిద్ధం చేస్తున్నది. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వం పబ్లిక్‌రంగ సంస్థలలోని 1,07,000 కోట్ల షేర్లను దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అమ్మివేసింది. 2014 మార్చినాటికి పబ్లిక్‌రంగ సంస్థల్లోని మరో 93,000 కోట్ల షేర్లను అమ్మాలని లక్ష్యంగా నిర్ణయించుకొంది. పబ్లిక్ రంగ సంస్థలను ఎత్తివేసే క్రమంలో భాగంగానే అవి ఖాయిలాపడ్డాయనే పేరిట తిరిగి పుంజుకోలేవనే పేరిట, ప్రభుత్వం వాటన్నింటినీ అమ్మి వేసేందుకు నిర్ణయించింది. 2011-12 వార్షిక బడ్జెట్లో ప్రభుత్వం 40 వేలకోట్ల పబ్లిక్ రంగసంస్థల షేర్ల అమ్మకానికి సిద్ధమని పేర్కొంది. 212 పబ్లిక్ రంగసంస్థల పని తీరును గమనిస్తే 2008-09లలో ఇందులోని 158 సంస్థలు లాభాలార్జిస్తుండగా, 54 నష్టాలు చవిచూశాయి. లాభాలార్జిస్తున్న 158 పబ్లిక్‌రంగ సంస్థలు 98,652 కోట్ల నికర లాభాలు సంపాదించగా, నష్టాలు చవిచూస్తున్న 54 సంస్థలు 14,424 కోట్ల నష్టాన్ని పొందాయి. మొత్తంమీద పబ్లిక్ రంగ సంస్థలు 84,228 కోట్ల రూ॥ల నికర లాభాన్ని ఆర్జించాయన్నమాట! కావున మొత్తంగా పబ్లిక్ రంగసంస్థల పరిస్థితి ఈ విధంగా వుండి లాభాలు ఆర్జిస్తుండగా ప్రభుత్వం ఈ లాభాలను పెట్టుబడి ఉపసంహరణ పేరిట ప్రైవేటు పెట్టుబడిదారులకు తరలించేందుకు సిద్ధమైంది. మరోవైపున ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలలోని కీలకమైన కార్య కలాపాలన్నింటినీ ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించటం, పొరుగు సేవల ద్వారా పొందటం వంటి పరోక్ష విధానాల ద్వారా ప్రైవేటీకరణను సాగిస్తున్నది. ఈ విధంగా పబ్లిక్ రంగసంస్థ అనే లేబిల్ మాత్రం మిగిల్చి ప్రభుత్వరంగ సంస్థలను సారాంశంలో ప్రైవేటు సంస్థలుగా కుదించి వేస్తున్నది. ఉదా: ఆంధ్రప్రదేశ్‌లోని కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కాలరీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. ఈ మొత్తం ప్రైవేటీకరణ అంతా సామాజిక రంగ నిధుల కొరకు వనరుల సమీకరణగా ఆడంబరంగా చూపెట్టబడు తున్నది. 2009-10 బడ్జెట్టు ప్రకటన ప్రకారం 51 లక్షల కోట్ల రూ॥ను బడాకార్పొరేట్ వర్గాలకి ఉదారంగా పన్నురాయితీలు కల్పించటం ద్వారానూ, ప్రతి సంవత్సరం పెరిగిపోతున్న పారు బాకీల తాలూకు 1 లక్షా 98 వేలకోట్ల రూపాయలు రద్దు చేయటం ద్వారానూ ప్రభుత్వం పెద్దఎత్తున ఆదాయం కోల్పోతూ కూడా పైవిధంగా ప్రకటించటమనేది ఉద్దేశ్య పూర్వకంగా ప్రజలను మోసగించడమే. సంపన్నుల పన్నుల ఎగవేతను అడ్డుకొనే బదులుగా, బడాపెట్టుబడిదారులు పన్నుల రాయితీలన్నీ రద్దు చేసే బదులుగా ప్రభుత్వ రంగసంస్థల షేర్ల అమ్మకాల ద్వారానే సామాజిక రంగ నిధులను సమకూర్చుకోవాలని వాదించటమనేది కాకమ్మకథలు చెప్పటం మినహా మరోటికాదు. ఏమైనప్పటికీ ఈ పెట్టుబడి ఉపసంహరణ క్రమమనేది ప్రభుత్వ రంగసంస్థల కార్మికుల పాలిట గొడ్డలివేటుగా పరిణమించింది. ప్రైవేటు యాజమాన్యాలు లాభాలను మరింతగా పెంచు కునేందుకు కార్మికుల వేతనాల తగ్గింపుకు, కార్మికుల సౌకర్యాల కుదింపుకు అనివార్యంగా పాల్పడతారు. ఇది-రెగ్యులర్, శాశ్వత కార్మికుల సంఖ్యను తగ్గించటానికి, ఏ విధమైన చట్టబద్ధ హక్కులకూ, సౌకర్యాలకూ ఆస్కారంలేని కాంట్రాక్టు కార్మికులతో పనిచేయించటం ద్వారా వారి సంఖ్య పెరుగులకు దోవతీస్తుంది.

ఈ విధంగా ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడి ఉపసంహరణలనేవి మొత్తంగా కార్మిక వర్గంపైనా, ప్రత్యేకంగా ప్రభుత్వరంగ సంస్థలలోని కార్మికులపైనా తీవ్రమైన దుష్ఫలితాలను కలుగజేస్తున్నవి. ప్రభుత్వరంగసంస్థల కార్మికుల జీవన, పనిపరిస్థితులపై తీవ్ర దుష్ఫలితాలను చూపటమేగాక, అసంఘటిత రంగంలో పెట్టుబడి దోపిడీ నుండి తనను తాను రక్షించుకొనేందుకు ఏ విధమైన హక్కులూ లేని కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున పెరిగిపోతున్నారు.

## చట్టరూపంలోనూ 8 గంటల పనిదినాన్ని ఎత్తివేసే చర్యలు

సూపర్ లాభాలు పోగేసుకునే క్రూరమైన దోపిడీనే నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల భూమికగా వుంది. ఈ విధానాలను స్వీకరించి, అమలుకు పూనుకున్న మన ప్రభుత్వం, పాలకులు-1886 చికాగో మేడే అమరుల స్ఫూర్తితో కార్మికులు తమ పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులన్నింటినీ ప్రక్కన బెట్టేస్తున్నారు. భారత కార్మికులు పోరాడి 1945లోనే సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని ఎత్తివేయటానికి ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. సంస్కరణల అమలు పేరుతోనూ, కార్మిక చట్టాల సంస్కరణల పేరుతోనూ భారత ప్రభుత్వం చేపడుతున్న ప్రతిఒక్క చర్యాకూడా 8 గంటల పనిదినమనే నిబంధనను ఎత్తివేసేందుకే జరుగుతున్నది. 1948 ఫ్యాక్టరీల చట్టాన్ని అధ్యయనం చేయాలనే పేరిట, 1948 ఫ్యాక్టరీల చట్టాన్ని సమగ్ర చట్టంగా రూపొందించే పేరిట ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకోసం ప్రభుత్వం మేధావులనబడే వారితో ఒక కమిటీని ఏర్పాటు చేసి మార్పులు చేయబూనుకున్నారు. ఈ కమిటీ 8 గంటల పనిదినాన్ని ఎత్తివేసే విధంగా కొన్ని సిఫార్సులు చేసింది. ఓవర్‌టైమ్ గంటలను పెంపు చేయాలని, మహిళా కార్మికులను రాత్రివేళ షిఫ్టులలో పనిచేసేందుకు అనుమతించాలని, ఫ్యాక్టరీ చట్టానికి సంబంధించిన కొన్ని అంశాలనుండి ఉద్యోగులను మినహాయించాలని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాక్టరీ చట్టంలో తమ సంబంధిత అంశాలలో మార్పులు చేసుకునేందుకు అనుమతి నివ్వాలని, కార్మికులపై విధించే జరిమానాలు పెంపు చేయాలనే పలు సిఫార్సులను చేసింది. ఇవన్నీ 8 గంటల పనిదినాన్ని తొలగించివేసే కార్మిక వ్యతిరేక విధానాలనేది నిస్సందేహమే. ఇప్పటికే కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో యాజమాన్యాలు ఫ్యాక్టరీ చట్టాన్ని అమలు చేయకుండా మినహాయింపులివ్వటం; దుస్తులు, జౌళిపరిశ్రమల్లోను ఐ.టి., బి.పి.ఓ. పరిశ్రమల్లోనూ రాత్రివేళల్లో మహిళా కార్మికులను అనుమతించారు. తద్వారా మహిళా కార్మికుల, ఉద్యోగుల భద్రతకు పెనుముప్పుగా ఇలాంటి విధానాలను అమలు చేస్తున్నారు. వివిధ కారణాలతో ఇప్పటికే దుస్తుల పరిశ్రమలో, ఐటి,బి.పి.ఓ. పరిశ్రమల్లో, ఎగుమతి ప్రధాన పరిశ్రమలలో కార్మికులు రోజుకు 10 గం॥ నుండి 16 గం॥ వరకు పనిచేస్తున్నారు. మన దేశంలోని అనియత, అసంఘటిత పారిశ్రామిక రంగాలలో క్యాజువల్, రోజుకూలీ, కాంట్రాక్టు కార్మికులు, పిల్లలు, మహిళలతో సహా రోజుకు 12 నుండి 16 గంటలు పనిచేస్తున్నారు. ఈ కార్మిక వ్యతిరేక, అమానవీయ విధానాలను ప్రభుత్వం నిరోధించటమనేది జరగటం లేదు. దానికి భిన్నంగా ఈ విధమైన అమానవీయ విధానాల అమలును ప్రోత్సహించే అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వాలే సమ కూరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వమే పూనుకొని ఇటువంటి అమానవీయ చర్యలను, విధానాలను చట్టబద్ధం చేసేందుకు పార్లమెంటు ద్వారా పనిగంటలు పెంపుకు తగిన కార్మిక చట్టాలు రూపొందించేందుకు సిద్ధమౌతున్నది. 2011 మార్చి 23న రాజస్థాన్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో కార్మిక చట్టాల సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. ఈ బిల్లు చట్టరూపం తీసుకుంటే 40 మంది కార్మికుల కన్నా తక్కువగా పనిచేసే యూనిట్ల యాజమాన్యాలు మౌలిక కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన అవసరం లేకుండా మినహాయింపు లభిస్తుంది. అంటే, ఈ యాజమాన్యాలు కార్మిక చట్టాలలో నిర్దేశించిన విధంగా కార్మికులకు సంబంధించిన కనీస వేతనాలు, వేతనాల సక్రమ

చెల్లింపులు, రోజువారీ పనిగంటలు వంటి వాటిని వేటినీ అమలు చేయాల్సిన అవసరం లేదన్నమాట! ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే ఉత్పత్తి విభాగంలోని 78 శాతం కార్మికులు తీవ్రంగా నష్టపోతారు. వాస్తవానికి ఈ విధమైన ఉల్లంఘనలు ఇప్పటికే నిరభ్యంతరంగా సాగిపోతున్నాయి. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో, ఎగుమతి ఆధారిత ఉత్పత్తి మండళ్ళు (ఇపిజెడ్), ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (ఎస్ఇజెడ్)లలో కార్మిక చట్టాలేవీ అమలు కావటంలేదు. ఈ మండళ్ళలో పనిచేసే కార్మికులు వారి బాధలను కనీసం మొరపెట్టుకొనే అవకాశం కూడా లేకుండా తీవ్రమైన దోపిడీకి గురౌతున్నారు. ప్రస్తుతం 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్' (డిఐపిపి) అనే ఒక తటస్థ విధాన నిర్ణయ సంస్థ ద్వారా 'నేషనల్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్స్' అనబడే మెగా ఉత్పత్తి విభాగపు మండళ్ళను ముందుకు నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. విధాన నిర్ణయ సంస్థగా చెప్పబడేదీ-ఈ జోన్లన్నింటి లోనూ కార్మిక చట్టాలను అమలు చేయవలసిన అవసరం లేదని, స్వయం నియంత్రితంగా ఉండాలని సూచిస్తున్నది. 'స్వయంనియంత్రితం' అంటే అర్థం కార్మికులను నికృష్టమైన దోపిడీకి గురిచేసేందుకు యాజమాన్యాలకు అన్ని విధాలైన కార్మిక హక్కుల, చట్టాల ఉల్లంఘనలకు స్వేచ్ఛనివ్వటమే!

బ్రిటన్ శాస్త్రవేత్తలు ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనంలో రోజులో ఎవరైతే ఎక్కువ గంటలు పనిచేస్తుంటారో అనగా రోజుకు 8 గం|| మించి పనిచేస్తారో వారికి గుండెపోటు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేలింది. ఈ విధమైన అధ్యయనాలను ప్రక్కనబెట్టి, మేడే కార్మికులు లేవనెత్తిన రోజుకు 8 గంటల పని అనే దాని స్ఫూర్తిని కాలరాస్తూ తమ సూపర్ లాభాలవేటలో కార్మికులను అతి తీవ్రమైన దోపిడీకి గురిచేయటమనేది బడాబూర్జువావర్గం కొనసాగిస్తున్నది.

## ట్రేడ్ యూనియన్ల ఏర్పాటునే అడ్డుకుంటున్న యాజమాన్యాలు

1947 అధికార మార్పిడికి పూర్వమే భారత కార్మిక వర్గం ఆనాటి బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలు నిర్వహించటం ద్వారా యూనియన్ల ఏర్పాటుకు, యూనియన్లలో కార్మికులు సంఘటితం అయ్యేందుకు హక్కులను సాధించుకున్నారు. ప్రజలు సంఘాలలో సంఘటితమయ్యే హక్కును భారత రాజ్యాంగం ఆమోదించిందికూడా. ఏమైనా, నయా ఉదారవాద, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రారంభంతో మన దేశంలో అత్యధికంగా విదేశీ పెట్టుబడితో నడిచే కార్పొరేట్ పరిశ్రమలు, తమ పరిశ్రమలలో కార్మికులు ట్రేడ్ యూమియన్లను ఏర్పరచుకునేందుకు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. మన దేశంలోని చట్టాలను అమలుచేయాలని, కార్మికుల చట్టబద్ధ హక్కులను వక్కాణించి ఆయా పరిశ్రమల యాజమాన్యం పై వత్తిడి తెచ్చే బదులుగా మన ప్రభుత్వం వారికి మద్దతుగా నిలుస్తున్నది. ఉత్తర భారత దేశంలో ప్రత్యేకంగా పంజాబ్, హర్యానాలలో ట్రేడ్ యూనియన్‌ల ఏర్పాటు అనేది దాదాపు అసాధ్యమైన పనిగా మారిపోయింది విదేశీ కార్పొరేట్ సంస్థలలో యాజమాన్యాల మద్దతుతో సంబంధిత ప్రభుత్వ విభాగాలు, మరియు యాజమాన్యాలు కల్పించే ఆటంకాలన్నింటినీ అధిగమించి కార్మికులు యూనియన్‌ను ఏర్పరచుకోవటానికి సంవత్సరాల కాలం పడుతున్నది. ఇటీవలి సంవత్సరాలలో విదేశీ కార్పొరేటు యాజమాన్యం (చెన్నైలోని హుండాయ్, ఫ్యాక్స్ కాన్ పరిశ్రమలు; హర్యానాలోని హోండా, రీకో పరిశ్రమలు; పంజాబ్‌లోని లిబర్టీ పరిశ్రమ; ఛత్తీస్‌ఘర్‌లోని అంబుజా-హోల్‌కిన్ సిమెంట్ పరిశ్రమలలో) ఆయా సంస్థలలో కార్మికులు తమ ట్రేడ్‌యూనియన్లను ఏర్పరచుకున్నందుకు, తమన్యాయమైన డిమాండ్లపై గొంతెత్తినందుకు వారిని పోలీసులతో ఎంతటి క్రూరంగా అణచివేతకు గురిచేశారనే విషయం మనం చూశాం. ఈ విధంగా ప్రభుత్వం చట్టబద్ధంగా కార్మికులకు వున్న హక్కులపై పెట్టుబడిదారులు సాగిస్తున్న విచక్షణారహిత దాడులకు క్రియాశీలకంగా సహకరిస్తున్నది. తమ న్యాయమైన సమస్యల పరిష్కారంకోసం కార్మికులు సాగించిన ఆందోళనలను అణచివేసేందుకు యాజమాన్యాలు తమ సెక్యూరిటీగార్డుల ద్వారా, ప్రైవేటు సైన్యాలద్వారా భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు, ఆందోళన సాగిస్తున్న కార్మికులను హత్యచేసిన సంఘటనలను ఇటీవలనే మనం చూశాం. ఈ ఘటనల సందర్భంగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్ర ప్రభుత్వం మౌన ప్రేక్షకులుగా వ్యవహరించాయి మినహా చట్టాన్ని అమలుచేయవలసిన ప్రభుత్వాలుగా, కార్మికులపై తీవ్రమైన దాడులకు పాల్పడిన యాజమాన్యాలను అడ్డుకొని నియంత్రించేదుకాని, శిక్షించేదుకు కానీ పూనుకోలేదు.

## కార్మికుల వేతనాల దిగకోతకు చర్యలు

అదుపు లేకుండా నిరంతరంగా పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం సమస్య నేడు భారత కార్మిక వర్గం ముందొక పెద్ద సవాలుగా వుంది. ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం నిజవేతనాల తగ్గుదలకు కారణమౌతూ కార్మికుల జీవన ప్రమాణాలను మరింతగా దిగజారుస్తూ దుర్భరంగా మారుస్తున్నది. ఈ విషయంలో కాంట్రాక్టు, క్యాజువల్, రోజుకూలీ కార్మికుల జీవితాలు మరింత వర్ణనాతీతంగా మారాయి. పెరిగిపోతున్న ఇళ్ళ అద్దెలేవి ఈ కార్మికుల సమస్యలను మరింత తీవ్రం చేస్తున్నాయి. కార్మికులను ఈ దుస్థితి నుండి బయటపడవేసేందుకు ప్రభుత్వం ఏ విధమైన చర్యలూ చేపట్టక పోగా, తయారు చేయబడిన రెడీమేడ్ ఆహార పదార్థాలు, సరుకులు ప్రపంచవ్యాపితంగా పెద్దఎత్తున చెలామణిలో వున్నాయని, ఆహార ధాన్యాల కొత్తపంటలు మార్కెట్‌లోకి రావటంతో వీటి ధరలు దిగివస్తాయని వల్లెవేస్తున్నారు. వాస్తవానికి అలాంటి అద్భుతాలెన్నడూ చోటుచేసుకోలేదు. ఈ పరిస్థితుల నడుమ కనీస వేతనాల నిర్ధారణ అనేది చర్చనీయాంశ విషయంగా మారింది. కనీస గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన కనీస వేతనాన్ని కార్మికులు డిమాండ్ చేస్తుండగా, యాజమాన్యం, నయా ఉదారవాద ఆర్థిక పండితులు కనీస వేతనాల కారణంగా ద్రవ్యోల్బణం పెరగటంతో తిరిగి ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసరాల ధరలు కూడా పెరిగిపోతాయని; గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కార్మికులకు కనీసవేతనాలను పెంచటంతో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడిందనీ, వ్యవసాయ కూలీల కొరకు వెచ్చించే కూలీ మొత్తంపెరగటంతో రైతులకు వ్యవసాయ పెట్టుబడులు పెరిగి పోతున్నాయని, ఈ విధంగా రైతుల ప్రయోజనాలకు హానికరంగా పరిణ మించిందనీ వాదిస్తున్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక విధాన మోసకారితనమంతా దాని కుటిల వాదనలలోనే వుంది. అద్దెలలో పెరుగుదల, ఇతర అవసరాల కొరకు ఖర్చుల్లో పెరుగుదల గురించి ఆర్థిక పండితులు సూత్రప్రాయంగా అంగీకరించినా కార్మికులు తమ వేతనాల పెంపుదల గురించి డిమాండ్ చేసినప్పుడు మాత్రం అదేదో తీవ్రమైన అన్యాయమైన డిమాండ్‌లాగా దాన్ని చిత్రిస్తున్నారు. అదేవిధంగా రైతు-విత్తనాలకు, విద్యుత్ అవసరాలకు, నీటి పారుదల అవసరాలకు, ఎరువులు-పురుగుమందుల అవసరాలకోసం ఎక్కువ వడ్డీ రేట్లు చెల్లించవలసినపుడు ఈ ఆర్థిక శాస్త్ర పండితులు వ్యవసాయ అవసరాల ధరలన్నీ ఈ విధంగా పెరిగిపోటమనే అన్యాయం పట్ల మౌనంగావుంటూ రైతు పండించిన పంట ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయబడక పోతుంటేకూడా నోరుమెదపని వీళ్ళు-వ్యవసాయకూలీల వేతనాల పెంపుదల సమస్య ముందుకొచ్చినపుడు మాత్రం ఈ సమస్యలన్నింటికీ వ్యవసాయ కూలీల వేతనాల పెరుగుదలే కారణమన్నట్లుగా మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఈ విధంగా అన్యాయమైన, అపసవ్యమైన వాదనలతో కార్మికుల వేతనాలు పెరగకుండా వత్తిడి తీసుకువస్తున్నారు. గురుగావ్, ఢిల్లీ, నోయిడా, మరియు చెన్నైలోని శ్రీపెరంబదూర్ వంటి పారిశ్రామిక ప్రాంతాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాన్ని మాత్రమే డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పెడచెవిన పెడుతున్నది. వాస్తవానికి ఇటీవలి ఆర్థిక సంక్షోభంతో ప్రపంచ వ్యాపితంగా వేతనాల పెరుగుదల, ఐ.ఎల్.ఓ. రూపొందించిన ప్రపంచవేతన నివేదిక 2010-11 ప్రకారం అమలు చేయటాన్ని గమనించవచ్చు. పనికి అతి తక్కువ వేతన చెల్లింపు అనేది విద్య, వైద్యరంగాలలో అభివృద్ధి లేకపోవటానికి కారణంగా ఐ.ఎల్.ఓ. ప్రకటించింది. భారతదేశం వంటి దేశాలలో చాలా ఎక్కువ ఆర్థిక పెరుగుదల రేట్లు ఒక వైపున కనబడుతూవుండగా, మరోవైపున తక్కువ వేతనాలు, అనియత కార్మికుల సంఖ్య పెరుగుదల కనపడుతున్నాయని పేర్కొంటూ వాస్తవికమైన, అమలు చేయగలిగిన కనీస వేతనాన్ని నిర్ధారించి, అమలు చేయటానికి పూనుకోవటమే ఈ సమస్య పరిష్కారానికి మార్గమని సూచించింది. కానీ, ఈ రోజుకు కూడా భారతదేశంలోని కార్మికుల వేతనాలు వారి కనీస అవసరాల ఆధారంగా రూపొందించటం జరగలేదు. 1957లో జరిగిన 15వ భారత కార్మిక సదస్సు చేసిన అవసరాల ఆధారిత కనీస వేతనాలకు సంబంధించిన సిఫార్సులను ప్రక్కన పడేశారు. ఈ పరిస్థితులలో భారత దేశంలో కార్మికులకు సరసమైన కనీస వేతనాలనేవి సుదూరపు కలగానే మిగిలివుంది. నేటికి కూడా ప్రణాళికా సంఘం కానీ, భారత ప్రభుత్వం కానీ కార్మికులు జీవించటానికి అవసరమైన కనీస వేతనాన్ని న్యాయపరంగానూ, చట్టపరంగానూ కనీసంగా యోచించటంలేదు. వ్యాపారం, వాణిజ్యం, సేవా, పారిశ్రామిక రంగాలలో అన్ని పార్శ్వాలలోకీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించటాన్ని అత్యావశ్యకంగా భావించిన ప్రభుత్వం, కార్మికుల కనీస వేతన సమస్యను పరిష్కరించేందుకు, దానిని పరిగణలోకి తీసుకునేందుకూ నిరాకరిస్తున్నది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా సంభవించిన ఆర్థిక సంక్షోభం నుండి కార్పొరేట్ యాజమాన్యాలను బయట పడేసేందుకు ఉద్దీపన పథకాలను ఎంతో ఉత్సాహంగా ప్రకటించిన ప్రభుత్వం ఇదే సంక్షోభ ఫలితంగా కార్మికుల భుజస్కంధాలపై మోపబడిన ఆర్థికభారాలను దించేందుకు ఏమాత్రం సిద్ధంగాలేదు.

## భద్రతా ప్రమాణాల కుదింపు

పని ప్రదేశంలో భద్రతాలోపం అనేది కార్మికులకు అతి ముఖ్యమైన సమస్య. భారతదేశ కార్మికులు ఎన్నో పోరాటాలు సాగించిన ఫలితంగా పని ప్రదేశాలలో భద్రతా సౌకర్యాల కల్పనకు చట్టపరమైన విధానాలను సాధించుకోగలిగారు. తద్వారా పని ప్రదేశాల్లో జరిగే ప్రమాదాలనుండి, తీవ్రగాయాలనుండి, ప్రాణాలు కోల్పోవటం నుండి, అంగవికలురవటాన్నుండి అనేక భద్రతా పరమైన ఏర్పాట్లను సాధించుకున్నారు. ప్రమాదకర వృత్తిపరమైన వ్యాధులనుండి రక్షించు కోవటంతో పాటుగా వర్క్‌మెన్స్ కాంపెన్‌సేషన్ యాక్ట్ ప్రకారం న్యాయంగా పొందవలసిన నష్టపరిహారాన్నీ పొందగలిగారు. ఏమైనప్పటికీ, నయాఉదారవాద, ఆర్థిక రాజకీయ విధానాల అమలుతో ఈ హక్కులు, సౌకర్యాలు, వసతుల కల్పనలనే నియమ నిబంధనలన్నింటినీ అమలు చేయని పారిశ్రామిక యాజమాన్యాల కారణంగా ఒక పద్ధతి ప్రకారం ఇవన్నీ కనుమరుగయ్యాయి. పనుల కాంట్రాక్టీకరణ అనేది యాజమాన్యాలను నష్టపరిహారం చెల్లించే బాధ్యత నుండి బయటపడేసింది. ఎంచేతనంటే కాంట్రాక్టు కార్మికులనే వారికి కార్మిక చట్టంలో చోటేలేదుగనుక! ప్రభుత్వమే భద్రతానియమ నిబంధనలను పాటించని ఫలితంగా వందలాది మంది కాంట్రాక్టు కార్మికుల, రోజువారీ కూలీల మరణాలు సంభవిస్తున్నాయి. పని ప్రదేశాల్లో ప్రమాదాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే పనులలోనే చోటు చేసుకుంటున్నాయి ఉదా: ఢిల్లీ మెట్రో రైలు మార్గం నిర్మాణం; కామన్‌వెల్త్ గేమ్స్ సందర్భంగా నిర్మాణాలు; వివిధ బ్రిడ్జిలు, ఓవర్ బ్రిడ్జిలు తదితర నిర్మాణాలు. పనిప్రదేశాల్లో ప్రమాదాలు, ఈ ప్రమాదాల్లో కార్మికుల మరణాలనేవి భారత దేశంలో ఒక సాధారణ విధానంగా మారిపోయింది. ప్రైవేటు పరిశ్రమల్లో కూడా-ముఖ్యంగా రసాయన పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో రసాయనాల కారణంగా కార్మికుల మరణాలు సంభవించటమనేది రోజువారీ విధానంగా మారింది. అదేవిధంగా బొగ్గు గనుల్లో సంభవించే ప్రమాదాలు కూడా. ఈ పని ప్రదేశాల్లో ప్రమాదాలనేవి తగిన భద్రతా చర్యలను, నిబంధనలను అమలు చేసేట్లయితే పూర్తిగా నివారించదగినవే, కానీ పెట్టుబడిదారీ యాజమాన్యాలు సూపర్‌లాభాల వేటలో ఈ భద్రతా నియమ నిబంధనలన్నింటి అమలుకై వెచ్చించాల్సిన నిధులలో విచక్షణారహితంగా కోత విధిస్తూ వస్తున్నారు. పని ప్రదేశంలో భద్రతా ప్రమాణాలు, ఏర్పాట్లను కల్పించే దానికన్నా యాజమాన్యాలు, ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తే దానిని మేనేజ్ చేయటమే లాభసాటైన మార్గంగా ఎంచుకుంటున్నాయి. ఎందుకంటే బాధితులంతా క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులు కావటం చేత కార్మిక చట్టాల ప్రకారం నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం లేకుండా ఎగవేయగల్గుతున్నారు. నష్టపరిహారం చెల్లించాల్సిన తప్పని పరిస్థితులు ఏర్పడితే, బాధితుల సహకార్మికులు ఆందోళనలకు పూనుకుంటే, నిరుపయోగ మైన వాగ్దానాలతో జోడించిన కొద్దిపాటి మొత్తాలతో, సంబంధిత ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలతో సమస్యను తేలికగా పరిష్కరించుకోగలుగుతున్నారు. వాస్తవానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పరిశ్రమల చొరబాటుతో పనిప్రదేశాల్లో నూతన తరహా ప్రమాదాలు చెప్పుకోదగిన స్థాయిలో పెరిగాయి. 63 సంవత్సరాల క్రితపు ఫ్యాక్టరీల చట్టం, ఇతర కార్మిక న్యాయసూత్రాలూ ప్రస్తుత పరిస్థితులకు సరిపోయే స్థితిలో ఏ మాత్రం లేవు. కానీ ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితులను అందుకొనే విధంగా ఫ్యాక్టరీ చట్టాన్నీ, న్యాయసూత్రాలను సవరించే బదులుగా, కార్మికుల రక్షణకోసం అరకొరాగా నైనా తోడ్పడే నియమనిబంధనలను కూడా ఎత్తి వేస్తున్నది. ఆధునిక పరిశ్రమలు ప్రత్యేకంగా ప్రమాదకర మైన భారీ రసాయన పరిశ్రమలు, ఓడల విచ్చిన్న పరిశ్రమల వంటి వాటిల్లో కార్మికుల వృత్తిపరమైన కారణాలతో అనారోగ్యానికి గురవటమనేది పెరిగింది. కానీ పారిశ్రామిక యాజమాన్యాలు కార్మికుల అనారోగ్యం, వృత్తిపరమైన వంటి వాటికి సంబంధించిన నిబంధనలన్నింటినీ ఉద్దేశపూర్వకంగానే అతిక్రమిస్తూ వస్తున్నాయి.

ఇటీవల మధ్యప్రదేశ్ అలిర్జాపూర్ నుండి వలస కార్మికులుగా వచ్చి గుజరాత్ రాష్ట్రంలోని క్వార్ట్జ్ క్రషింగ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వారి దయనీయస్థితి వెలుగులోకి వచ్చింది. వీరంతా అలిర్జాపూర్‌కు, మహారాష్ట్రలోని ఇతర జిల్లాలకు చెందిన గిరిజనులు. వీరు తమ సాంప్రదాయక జీవితాన్ని కోల్పోయారు. వలస కార్మికులుగా మిగిలారు. గుజరాత్-క్వార్ట్జ్ క్రషింగ్ ఫ్యాక్టరీలో వీరంతా రోజువారీ కార్మికులుగా గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వీరు ప్రధానంగా తెల్లరాతి పొడిని గన్నీ బస్తాలలో నింపే పనిని చేస్తూవస్తున్నారు. ఈ పని పైకి చూడటానికి సులభమైనదిగా కన్పడుతుంది. కానీ క్వార్ట్జ్ పొడి లోనే ఉండాల్సిన ప్రమాదమంతా వుంది. కార్మికులు సంవత్సరంలో 3 నెలలపాటు, రోజుకు 8 నుండి 12 గంటల చొప్పున ఈ పనిలో వుంటూ రాతిపొడిని గన్నీ బస్తాలకు నింపే సందర్భంలో వారు శ్వాస ద్వారా ఆ పొడిని లోపలికి పీలుస్తున్నారు. ఈ సిలికా దుమ్ము ఊపిరితిత్తులలోకి చేరటం ఫలితంగా నివారణ సాధ్యంకాని తీవ్ర 'సిలికోసిస్' అనబడే శ్వాసకోశ సంబంధవ్యాధికి గురవుతున్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ ప్రకారం క్వార్ట్జ్‌ను మరాడించటమనేది ప్రమాదకరమైన వృత్తి అనీ, దాని ద్వారా కొద్ది నెలల్లోనే నూటికి నూరుశాతం సిలికోసిస్ వ్యాధికి గురవుతారనీ స్పష్టమౌతున్నది. కానీ లాభాపేక్షకే పరిమితమైన పారిశ్రామిక యాజమాన్యాలు అమాయక గిరిజనులను ఈ ప్రమాదకర పనిలో ఉపయోగించి విడివిడి కార్మికులుగా కాకుండా కుటుంబాలకు కుటుంబాలే అనివార్య మరణాలకు గురయ్యేట్లు చేస్తున్నాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేవీ ఫ్యాక్టరీ యజమానులు సాగించే ఈ అమానవీయ దుర్మార్గాన్ని నిరోధించేందుకుగానీ లేక తగిన ఆరోగ్య భద్రతా చర్యలను చేపట్టటంకానీ, 'సిలికోసిస్' బాధితులకు తగిన నష్టపరిహారాన్ని అందించే ఏర్పాట్లుగానీ చేయటానికి పూనుకోలేదు. ప్రస్తుత భారత కార్మికుల దుస్థితికి సంబంధించిన కారణాలలో ఇదొక ముఖ్యమైన అంశం. మన దేశంలోని దాదాపు అన్ని పరిశ్రమల్లోనూ పని ప్రదేశాల్లో భద్రత అనేది పూర్తిగా లోపిస్తూ, ప్రమాదకర వృత్తిపరమైన అనారోగ్యాలకు కార్మికులు గురికావటమనేది ముఖ్యమైనదిగావుంది.

## మహిళా కార్మికులపై అధికమౌతున్న శ్రమదోపిడి

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలంలో మనదేశంలో ఉత్పత్తిలో మహిళల పాత్ర గణనీయంగా పెరిగింది. అధిక సంఖ్యలో మహిళలు తయారీ, ప్రాసెసింగ్, సేవా రంగాల్లో తీసుకోబడుతున్నారు. కానీ మహిళా కార్మికుల శ్రమకు సరైన గుర్తింపే వుండటంలేదు. పారిశ్రామిక యాజమాన్యాలు వారి శ్రమశక్తిని కారు చౌకగా కొల్లగొడుతున్నాయి. దుస్తులరంగం, జౌళిరంగం, బి.పి.ఓ. పరిశ్రమలలో ఈ ధోరణి కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. నైపుణ్యంగల పనులను మహిళా కార్మికుల చేత చేయిస్తూ కూడా నైపుణ్యం లేని కార్మికులతో పాటుగానే వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు కూడా మగ కార్మికుల వేతనాలకంటే తక్కువగానే వుంటాయి. వీటికి తోడు వివిధ రకాలైన క్రూరమైన అత్యాచారాలకు, హత్యలకు అనేక రూపాలలో గురవుతూ లైంగిక వేధింపులకు, బయటకు ప్రకటించలేని ఎన్నో రకాలైన అవమానాలకు గురవుతున్నారు. వీరి సేవల్ని పొందుతున్న పారిశ్రామిక యాజమాన్యాలు కానీ లేదా ప్రభుత్వాలు కానీ మహిళా కార్మికులకు, ఉద్యోగులకు భద్రత లేదా రక్షణలను కల్పించేందుకు ముందుకు రావటంలేదు. సరుకుల తయారీ, ప్రాసెసింగ్, ఆధునిక సేవా విభాగాలలో మహిళా కార్మికుల విషాదకర పరిస్థితి ఈ విధంగా వుండగా అగ్గిపెట్టెల పరిశ్రమ, బీడి పరిశ్రమ, జీడిపిక్కల పరిశ్రమలలో; చేపల ప్రాసెసింగ్, ప్యాకింగ్ తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా వుంది. ఈ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులంతా అనేక అవమానాలను దిగమింగుకుంటూ రోజుకు 10 గంటలకు పైగా పనిచేస్తున్నారు. సాంప్రదాయక రంగాలైన చేనేత, భవన నిర్మాణ విభాగాల్లోనూ, వ్యవసాయ రంగంలోనూ, సంబంధిత వివిధ విభాగాల్లోనూ పనిచేస్తున్న మహిళా కార్మికుల పరిస్థితులు మరింత దయనీయంగా వున్నాయి. బయటకు ప్రకటించుకోలేని తీవ్రమైన విషాదంలో వీరు కూరుకుపోయివున్నారు. వీరి పనికి ఏ విధమైన గుర్తింపూలేదు. వ్యవసాయ రంగంలో పనిచేసే మహిళల పరిస్థితి దుర్భరంగావుంది. వ్యవసాయ సీజన్‌లో వలస కూలీలుగా వెళ్ళే మహిళల బాధలు వర్ణనాతీతంగా వున్నాయి. ఆయాప్రాంతాల్లో వీరు ఎన్నో విధాలైన లైంగిక

**(తరువాయి 6వ పేజీలో)**

**మనదేశ..** (5వపేజీ తరువాయి)

వేధింపులు, అత్యాచారాలతో పాటు హత్యలకు గురౌతున్నారు. దీనిక తోడుగా, వీరు తరుచూ జరుగుతున్న రోడ్డుప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిని పొలం పనుల కాంట్రాక్టర్లు-ట్రక్కులు, లారీలు, ఆటో రిక్షాలలో కుక్కి ఇతర ప్రాంతాలకు తరలించే సందర్భంగా ఈ ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. భారత కార్మికుల దుస్థితికి సంబంధించిన, సీరియస్‌గా పరిగణించవలసిన మరో కోణమిది.

## బాలకార్మికులపై బహుముఖ దోపిడి

బాల కార్మిక వ్యవస్థ భారతదేశంలో గొప్పగా వర్ధిల్లుతున్నది. అత్యాధునిక గ్లోబలీకరణ యుగంగా చెప్పబడుతున్న ఈ కాలంలో కూడా బాల కార్మికులు నికృష్టమైన దోపిడీకి గురిచేయబడుతున్నారు. ఐ.ఎల్.ఓ. ప్రకారం, భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో బాలకార్మికులు పనిచేస్తున్నారు. కనీస హక్కులు నిరాకరించబడి, అతి దుర్భరమైన చెమటోడ్చే పనుల్లో రోజుకు 12 నుండి 16 గంటలు పనిచేస్తూ, నామ మాత్రపు వేతనాలు మాత్రమే చెల్లించబడుతూ బాల కార్మికులు దోపిడీకి గురవుతున్నారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని హజారీబాగ్‌జిల్లా బొగ్గుగనులలో 1952 గనుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఎలుకల కలుగులువంటి ప్రదేశాలలో 400 అడుగులలోతు బావులలో రోజుకు 13 గంటల పాటు బాలకార్మికులచే శ్రమ చేయిస్తున్నారు. వేడి చేయబడిన పదునైన ఇనుప కడ్డీలతో తవ్వబడిన బోరియల్లో వారిచే బలవంతంగా చాకిరీ చేయిస్తున్నారు. తరుచుగా సంభవించే ప్రమాదాలలో అనివార్యంగా ఈ బాల కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. బొగ్గుధూళి కణాలు పీల్చుకోవటంతో వీరు తరచుగా శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురౌతున్నారు. వీరి ప్రమాదాలకు, ప్రాణాలకు ఏ విధమైన నష్టపరిహారమూ చెల్లించరు. దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని పారిశ్రామిక ప్రాంతాలలో సైతం బీహారుకు చెందిన 8-14 సంII వయస్సున్న పిల్లలు ఉదయం 9 నుండి అర్ధరాత్రి 12 గంటల వరకూ అంటే రోజుకు 15 గంటలు చాకిరీ చేస్తున్నారు. కోహినూర్‌ఫుడ్స్ లిమిటెడ్‌కు చెందిన కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో సాగే ఈ పనిలో బాసుమతిబియ్యం అమ్మకాలు సాగిస్తూ 'బాల కార్మిక విధానానికి తాము వ్యతిరేకమ'ని ప్రకటిస్తూనే ఈ విధమైన దోపిడీ సాగిస్తున్నారు. వారాంతంలో చెల్లించే 20 రూII మినహా ఈ పిల్లలకు మరే విధమైన వేతనాన్నీ చెల్లించరు. ఈ బాలకార్మికులంతా కడుబీద ముస్లిం కుటుంబాలకు చెందినవారే. ఇంతటి అమానవీయత పట్ల కూడా ప్రభుత్వం కనీస స్పందనతో వ్యవహరించటంలేదు.

## కట్టుబానిస తరహా దోపిడి

ఈ అత్యాధునిక యుగంలో కూడా కట్టుబానిస విధానాన్ని కొనసాగించటంపట్ల ఇటీవల సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మందలించింది. కట్టుబానిస విధాన (నిషేధ) చట్టం-1976 అమలులో వున్నప్పటికీ కట్టుబానిస విధానం నిరాటంకంగా సాగిపోతూనే వున్నది. ఆధునిక భారత దేశంలో కూడా మానవ మలమూత్రాలను చేతులతో తొలగించే అనాగరిక విధానం కొనసాగుతున్నందుకు మన పాలకులేమీ సిగ్గుపడటంలేదు. ఒకరాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి ఇటుకల, టెయిల్స్ పరిశ్రమల్లో పని చేసేందుకు కుటుంబాలతో తరలివెళ్ళే కార్మికుల పరిస్థితి కట్టుబానిసల పరిస్థితికంటే మరింత ఘోరంగా వుంది.

నయాఉదారవాద ఆర్థిక విధానాల తాకిడికి బలంగా గురైన వారిలో టీ ప్లాంటేషన్ కార్మికులున్నారు. బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా టీ తోటల కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాల ఫలితంగా ప్లాంటేషన్ కార్మిక చట్టం - 1951 ఉనికిలోకి వచ్చినప్పటికీ టీ ఎస్టేట్‌ల యాజమాన్యం కార్మికుల హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నప్పటికీ వారిని ఆ చట్టం ఏమీ అడ్డుకోవటంలేదు. కార్మికులకు పునరావాసం కల్పించబడటంలేదు. వారికి సామాజిక న్యాయం అందటంలేదు. గౌరవనీయమైన జీవితాన్ని ఎంచుకునేందుకు వారికి మరో ప్రత్యామ్నాయమేమీ కల్పించటం లేదు. ఈ టీ తోటల కార్మికులు ఏ విధమైన పునాదిలేని, కుటుంబమే కేంద్రంగా, తీవ్రశ్రమచేస్తూ గడిపేవారుగా వుంటారు. టీ తోటల కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను చెల్లించకుండానే యాజమాన్యం టీ ఎస్టేట్స్‌ను మూసివేశాయి. మరికొన్ని టీ ఎస్టేట్ల యాజమాన్యం వారి ఎస్టేట్ పరిధుల్లో తేయాకు కాకుండా మరో పంటను పండించేందుకు చూస్తున్నారు. భారతదేశ కార్మికవర్గంలో ముఖ్యమైన భాగంగావున్న టీ తోటల కార్మికులు అంతిమంగా అత్యంత బాధితులుగా వున్నారు.

## కార్మికోద్యమాలపై పోలీసుల అణచివేత

వలసపాలకుల నుండి ప్రస్తుత 'స్వతంత్ర', 'ప్రజాస్వామ్య' పాలకులవరకూ ప్రయోగించే నిర్బంధం-అణచివేతలకు నిరంతర పోలీసు బాధితులుగా కార్మికులే ఉన్నారు. పురాతన వలస, నిర్బంధ-అణచివేత చట్టాలనే పాలకులు శాంతిభద్రతల పరిరక్షణ పేరిట నేటికీ అమలు చేస్తూ వస్తున్నారు. పోలీసులు, కార్మికులు-యాజమాన్యం మధ్య వివాదాలలోకి చొరబడి యాజమాన్య ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. లాఠీఛార్జీలు జరిపి, గాయపర్చడం, కాల్పులు జరిపి కార్మికులను హత్యచేయటం, అరెస్ట్‌చేసి తప్పుడు కేసుల్లో ఇరికించడం, 144 సెక్షన్ విధించటం ద్వారా కార్మికుల శాంతియుత ఆందోళన సందర్భంగా కనీసం నిరాహార దీక్షలను కూడా చేయనీయకుండా అనాగరికంగా దాడులు సాగించి అడ్డుకుంటున్నారు. రాజ్యం మరియు న్యాయ వ్యవస్థ పారిశ్రామిక వివాదాల్లో తలదూర్చనీయకుండా పోలీసులను కట్టడిచేయాలి. కార్మికులను నిరంకుశంగా అణచివేయటాన్ని నిరోధించాలి. కానీ, దీనికి భిన్నంగా ఈ వ్యవస్థలు కార్మికుల ఆందోళనలపైకి పోలీసులను ఉసిగొల్పి వారి ఆందోళనలను నిరంకుశంగా అణచి వేయమని ప్రోత్సహిస్తున్నాయి. ఈ విధంగా మన 'ప్రజాస్వామ్య వ్యవస్థ'లో అత్యధిక ప్రజానీకంగా వున్న కార్మికులు, శ్రామిక ప్రజానీకం పెట్టుబడిదారీ పారిశ్రామికవేత్తల ప్రయోజనాల పరిరక్షణ కొరకు అణచివేయబడుతున్నారు. గత 63 సంIIల భారత దేశ చరిత్రలో శాంతి భద్రతలను కాపాడే దానిలో భాగంగా పోలీసులు ఏనాడూ యాజమాన్య ప్రతినిధులను అరెస్టు చేసిన ఒక్క సందర్భాన్ని కూడా చూసివుండము. కానీ ఈ యాజమాన్యాలే కార్మికుల హక్కులను, చట్టాలను, నిర్దాక్షిణ్యంగా కాలరాస్తూ, తత్సంబంధ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడటం ఫలితంగా కార్మికులు అనివార్యంగా తమ బాధలు, కష్టాల పరిష్కారం కోసం ఆందోళనల్లోకి నెట్టబడుతున్నారు.

ఈ విధంగా యాజమాన్యమే కార్మికులను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నది. వాస్తవానికి కార్మికులపై నిర్బంధం - అణచివేతకు అనుకూలమైన వాతావరణాన్ని మన పాలకులు, ప్రభుత్వం కల్పించారు. ఇది పోలీసులను తమకు తామే పాలకులుగా భావించి వ్యవహరించే విధంగా పురిగొల్పుతున్నది. ఆందోళన చేస్తున్న కార్మికులపై తీవ్రమైన పగ, ద్వేషం, ప్రతీకారాలతో పోలీసులు విరుచుకు పడుతున్నారు. అదే సందర్భంలో మానవజాతికి-ప్రత్యేకించి కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నీచమైన నేరాలకు పాల్పడుతూ అన్ని రకాల చట్టాల ఉల్లంఘనలకీ పాల్పడుతున్న దోషులు ఈ పెట్టుబడిదారులేననే విషయం ప్రక్కనుంచి వారిపట్ల వినయవిధేయతలతో వీరి ముందు తలవంచి సేవలు చేస్తున్నారు. ఇటీవల (ఏప్రిల్ 7వ తేదీన) ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరం డి.ఎమ్. అండ్ హెచ్.ఓ. కార్యాలయం ఎదుట బైఠాయించి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లపై సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసులు అనాగరికంగా, అకారణంగా విరుచుకుపడి లాఠీఛార్జీ సాగించటం-పోలీసులు ఎంతటి కర్కశంగా వ్యవహరించగలరో విశదపరుస్తున్నది. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో 2011 మే 3న జరిగిన మరొక సంఘటన, పోలీసులు తమకు తామే పాలకులుగా భావిస్తూ, పెట్టుబడిదారుల నమ్మకమైన సేవకులుగా వ్యవహరిస్తూ కార్మికులపై విచక్షణారహిత హింసకు ఏ విధంగా పాల్పడ్డారో తెలియజేస్తున్నది. తూర్పు ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్ పారిశ్రామిక ప్రాంతంలో అంకూర్ ఉద్యోగ్ లిమిటెడ్ అనే పరిశ్రమ యజమాని గూండాలను నియమించి వారితో కార్మికులపై దాడులు సాగించటమే గాక, కాల్పులు జరిపించి 19 మందిని తీవ్రంగా గాయపరిచాడు. కార్మికులంతా కలసికట్టుగా గూండాలను ఎదిరించి వారు పారిపోయే అవకాశం లేకుండా నిర్బంధించారు. దానితో ఈ ప్రాంతానికి పోలీసుల బృందాలు చేరుకొని, ఎవరైతే కార్మికులపై కాల్పులు సాగించారో ఆ గూండాలను అరెస్టు చేయటానికి వారిపై నేరాన్ని నమోదు చేయటానికి నిరాకరించారు. కానీ ఆందోళన చేస్తున్న కార్మికులు బయటనుండి మావోయిస్టుల చేత ప్రేరేపించబడ్డారనే ప్రచారానికి పాల్పడుతూ గోరఖ్‌పూర్ పోలీస్ కమీషనర్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశాడు-అందులో 'బయటశక్తులు కార్మికులని రెచ్చగొట్టటాన్ని పోలీసులు సహించబోరనీ, వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటార'నీ పేర్కొన్నాడు. ఇదే సందర్భంలో ఈ పోలీసు ఉన్నతాధికారి యాజమాన్యంచే నియమించబడి, కార్మికులపై కాల్పులు సాగించిన గూండాలను సమాజశ్రేయోభిలాషులుగా పేర్కొన్నాడు. పోలీసులు, మరోవైపు యాజమాన్య గూండాల ఈ దాడులు భారత కార్మిక దుస్థితిని మరింత పెంచివేసేవిగా వున్నాయి.

## వలస కార్మికులపై విచ్చలవిడి దోపిడి

భారతదేశంలోని కార్మికుల దుస్థితి ఇలావుండగా, భారతదేశం నుండి ఇతర దేశాలకు ముఖ్యంగా యు.ఏ.ఇ. దేశాలకు వలస వెళ్ళిన కార్మికుల బాధలు, కష్టాలు, వారిపైసాగే దోపిడీ వర్ణనాతీతంగావుంది. నీచమైన బానిస స్థితిగతుల్లో వారు బలవంతంగా చాకిరీ చేసేందుకు నెట్టబడుతున్నారు. ఎన్నో విధాలైన అవమానాలకు, అకృత్యాలకు గురౌతున్న మహిళా వలస కార్మికుల దుస్థితి చెప్పవలనవికానిది. 'ప్రవాస్ దివస్' పేరిట భారత ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించే తంతు ప్రవాస భారతీయుల విలాసవంతమైన సంతగానే వుంది మినహా భారత ప్రభుత్వానికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యనిల్వలలో ఒక ముఖ్యమైన భాగాన్ని సమకూరుస్తున్న వలస కార్మికుల ప్రయోజనాల కొరకు కాదనేది స్పష్టమౌతున్నది.

ఇటీవల యు.ఎస్.ఫెడరల్ ఏజన్సీ (యు.ఎస్. ఈక్వల్ ఎంప్లాయిమెంట్ ఆపర్చ్యునిటీ కమిషన్) కార్మికులను సరఫరా చేసే ఒక సంస్థపై వ్యాజ్యం నడిపింది. విసిసిపి మరియు టెక్సాస్ నౌకాశ్రయాలలో పనిచేసేందుకు పంపిన 500 మంది కార్మిక అసమానత్వ కార్యశైలిపై ఈ వ్యాజ్యం నడిచింది. ఈ కార్మికులను చుట్టూతా కంచె వేయబడిన స్థలాలలోనో లేదా నివాసయోగ్యం కాని ఇళ్ళలోనో బలవంతంగా వుంచి వాటికి రుసుమువసూలు చేయటం ద్వారా కూడా దోపిడీకి గురిచేస్తూ సారాంశంలో వారి నికర ఆదాయం శూన్యం చేస్తున్నారు. ఎలుకల్లాగా, పురుగుల్లాగా అనేకమంది కార్మికులు ఒకేచోట ఇరుక్కుని జీవించాల్సి వస్తున్నది. వీరి పాస్‌పోర్టును వీరి వద్దనుంచి యజమానులు స్వాధీనం చేసుకొని తమ వద్ద వుంచుకుంటారు. తమపై సాగుతున్న దోపిడీ గురించి కార్మికులు ఫిర్యాదు చేసేట్లయితే పాస్‌పోర్టును తిరిగి ఇచ్చేది లేదని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఇదీ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి పెద్ద గొంతుతో అందరికీ పాఠాలు బోధించే అమెరికాలో నిరభ్యంతరంగా సాగించబడుతున్న అమానవీయమైన, నికృష్టమైన దోపిడీ!

ప్రస్తుతం మనదేశంలో నెలకొన్న వాతావరణం పట్ల, భారత కార్మికులను సూపర్ దోపిడీ సాగించి సూపర్ లాభాలు పొందేందుకు, కార్మికుల శ్రమను కారుచౌకగా కొల్లగొట్టి తమ ఉత్పత్తులను పెంచుకునేందుకు అనుగుణమైన వాతావరణం పట్ల కార్పోరేట్ యాజమాన్యాలు సంతృప్తికరంగా వున్నాయి. ఇటీవల కాలపు (ఏప్రిల్ 6) నాటి నివేదిక ప్రకారం చెన్నైలోని 'కన్‌సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్‌సార్టియమ్ లిమిటెడ్' పేరుతో ఒక నిర్మాణ పరిశ్రమ-గత కాలపు ఎల్ అండ్ టి ఉన్నతాధికారులచే స్థాపించబడి, ఆసియా, ఆఫ్రికా దేశాలనుండి కార్మికులను రప్పించి తమ ప్రాజెక్టులలో పనిచేయించాలని నిర్ణయించింది. గత 3 సంIIల కాలంలో కార్మికుడి దినవేతనం రూ. 90 నుండి 200 రూIIకు రెండురెట్ల పైగా పెరిగినప్పటికీ బీహార్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలనుండి వచ్చి పనిచేస్తున్న భారత కార్మికుల ఉత్పాదకత, వేతనాల నిష్పత్తి కనుగుణంగా పెరగలేదనీ, కావున ఆఫ్రికా, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి దేశాలనుండి కార్మికులను రప్పించి పని చేయించేందుకు నిర్ణయించామనీ ఎందుకంటే స్థానిక కార్మికులకంటే యాజమాన్యం ఆశిస్తున్న 3 రెట్ల ఉత్పాదకతను వీరు సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ విధమైన తీవ్ర దురాశతో బడాపెట్టుబడిదారులు కార్మికుల శ్రమను పీల్చిపిప్పి చేయదలచుకున్నారు. దీనికి వారు స్థానికంగా కార్మికుల కొరత అనే సాకుతో కార్మికుల దిగుమతికి ప్రభుత్వాలనుండి అనుమతిని పొందబోతున్నారు. ఇటీవలి కాలపు మాధ్యమాలలో నివేదికలను బట్టి కొన్ని చైనా పరిశ్రమలు అభివృద్ధిచెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల నిర్మాణంలో కార్మికులను సమకూర్చాయి. ఈ విధంగా స్వేచ్ఛా వాణిజ్య విధానాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దశలో బడాపెట్టుబడి-కార్మికుల శ్రమను దారుణమైన విధానాల ద్వారా అమానవీయంగా దోచుకునేందుకు పోటీపడుతున్నది. మరింత కారు చౌకగా కార్మికుల శ్రమ దిగుమతి చేసుకోవటమనేది భారత కార్మికుల దుస్థితిని తీవ్రంచేసే మరో ప్రమాదంగా రానున్నది.

## పెరుగుతున్న కార్మికుల అసహనం-ఆకస్మిక చర్యలు

మరోవైపున తమ జీవన, పని పరిస్థితుల మెరుగుదలకోసం అకస్మికంగా కార్మికులు పోరాటాల్లోకి వస్తున్నారు. అయితే పైన పేర్కొనబడిన అనేక ప్రతికూల పరిస్థితుల కారణంగా కార్మికులు నిస్పృహతో కూడిన తెగింపు చర్యల వైపుకు నెట్టబడుతున్నారు. మేనేజర్లను హతమార్చటం, స్వయంవిధ్వంసక చర్యలు, సామూహికంగా ఆత్మహత్యలు చేసుకుంటామనే బెదిరింపులు, స్వీయ హత్యలు వంటి కార్మికవర్గేతరమైన చర్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల విజయవాడ థర్మల్ విద్యుత్ పరిశ్రమలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు సర్వీసుల క్రమబద్ధీకరణ సాధించుకోలేని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడేందుకు తమ చేతులను తెగకోసుకున్నారు. ఈ విధమైన చర్యలు కార్మికవర్గ పోరాటాలను ముందుకు గొనిపోలేకపోగా వాటికి నష్టం కలుగజేస్తాయి. ఎందుకంటే, ఈ విధమైన చర్యలన్నీ కార్మిక వర్గేతర చర్యలేకాక అంతిమంగా ఇవన్నీ యాజమాన్యం చేతిలో ఆయుధాలుగా కార్మికుల పోరాటాలను అణచివేసేందుకే ఉపయోగపడతాయి.

## కార్మికవర్గ రాజకీయాలను, కార్మికవర్గ దృక్పథాన్ని ఎత్తిపట్టాలి

గత వంద సంవత్సరాలపైగా భారత కార్మికవర్గం వెలదిరాపోల్లో సాగించిన పోరాటాల ద్వారా సాధించిన హక్కులు, సౌకర్యాలన్నీ తీవ్రమైన కోతలకు గురౌతూ, కార్మికుల హక్కులు, సౌకర్యాలపై బడాపెట్టుబడి యొక్క ఒక తీవ్రమైన దాడి కొనసాగుతున్నది.

భారతదేశంలో కార్మికోద్యమ నిరాశాజనక పరిస్థితి గురించి బాధపడుతూ కూర్చోవటమో లేదా కార్మికుల హక్కుల అణచివేతకు గల కారణాల అన్వేషణకై ఎకడమిక్ చర్చలలోకి ప్రవేశించాల్సిన అవసరమో లేదు.

**భారతదేశంలో కార్మికోద్యమము కార్మికవర్గ దృక్పథాన్ని, కార్మికవర్గ రాజకీయాల్ని రద్దు చేసుకోవడమన్నదే ఈ విషాదకర పరిణామాలకు మూలకారణం. ప్రస్తుత భారత కార్మికుల దుస్థితికి, దుర్దశకు సంబంధించిన భారత కార్మికవర్గ ఉద్యమ విమర్శనాత్మక సమీక్షలో ముఖ్యమైన, ప్రధానమైన సారాంశం ఇదే.**

సోషలిజం సాధన దిశగా పోరాటాల్ని సాగించేందుకు, కార్మికవర్గ నాయకత్వంలో పురోగమించేందుకు స్ఫూర్తిగా, మేడే ప్రాధాన్యతను మనం అర్థం చేసుకుంటే, భారత కార్మికవర్గం-కార్మికులను ఒక వర్గంగా సంఘటితపరచి సోషలిజం సాధించేందుకు; ప్రస్తుత దశలో భారత కార్మిక వర్గాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం దిశగా ముందుకు నడిపేందుకు ప్రతిన తీసుకోవటమే పరిష్కారమని విదితమౌతుంది ఈ విధమైన లక్ష్యంతో భారత విప్లవకారులు కార్మికవర్గ ఉద్యమాన్ని నిర్దేశిత గమ్యానికి విజయవంతంగా నడపగలుగుతారు.

*



# సెజ్‌ల పేరుతో భూముల నుండి రైతాంగం తొలగింపు--జాడలేని పరిశ్రమలు-ఏర్పడని ఉపాధి

**పారిశ్రామిక** అభివృద్ధి, ఎగుమతులు, ఉపాధి కల్పనల కోసం దేశంలో, రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం 2005లో చట్టం రూపొందించి, 2006 ఫిబ్రవరిలో అమలులోకి తెచ్చారు. ఈ చట్టం రాకముందే ఇలాంటివి అమలులో ఉన్నాయి. 1965 సం॥ నుండే ఎగుమతి మండలాల (ఎక్స్‌పోర్టు ప్రాసెసింగ్ జోన్స్) పేరుతో దేశంలోని పలు రాష్ట్రాల్లో సెజ్‌లను పోలిన పారిశ్రామిక వాడలు ఉన్నాయి. సెజ్‌లకు యిచ్చినట్లుగానే వీటికి ప్రభుత్వం అనేక రాయితీలు ప్రకటించింది.

ఇప్పటి వరకు దేశంలో 514 సెజ్‌లకు కేంద్ర ప్రభుత్వం లాంఛన ప్రాయంగా ఆమోదం తెలిపింది. 172 సెజ్‌లను నోటిఫై చేసింది. మన రాష్ట్రంలో మూడు కోస్టల్‌కారిడార్‌లను ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. మన రాష్ట్రంలోనే 109 సెజ్‌లకు ఆమోదం తెలిపింది. తీరప్రాంతాల అభివృద్ధి పేరుతో దేశంలో మూడు కోస్టల్ కారిడార్‌లను ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రరాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం నుండి నెల్లూరు జిల్లా తడవరకు 970 కి.మీ. ప్రాంతంలో కారిడార్ ఏర్పాటు జరుగుతున్నది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న 109 సెజ్‌లలో 75 శాతం ఈ కారిడార్‌లోనే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని కాకరాపల్లి, సోంపేట, డుంకూరు ప్రాంతాల్లో ఆరు థర్మల్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నెల్లూరు జిల్లాలో 24 పాంట్లకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలిలో అణువిద్యుత్ ప్లాంట్‌కి గ్రీన్ సిగ్నలు యిచ్చింది.

సెజ్‌లలో పరిశ్రమలు ఏర్పాటు చేసే బడా పారిశ్రామిక వేత్తలకు కావాల్సిన భూమిని ప్రభుత్వమే సేకరించి యిస్తున్నది. పెట్టుబడులను సమకూర్చి పెట్టటం; పన్నులు, దిగుమతి సుంకం రాయితీ కల్పించటం, కార్మిక చట్టాలు అమలు కాకుండా చేయటం వంటి పలు రాయితీలను ప్రభుత్వం కల్పించింది. ఇలాంటి రాయితీల వలన, సెజ్‌ల ఏర్పాటు వలన వేలకోట్ల పెట్టుబడులు రావటంతోపాటు, లక్షలాది ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ప్రచారంచేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ఇప్పటికీ ప్రయత్నం చేస్తూనే ఉంది.

2004-10 సం॥ మధ్యకాలంలో ప్రభుత్వం ఎపిఐఐసి, రెవిన్యూశాఖలకు 82,792.87 ఎకరాలను అప్పగించింది. అందులో 65,570 ఎకరాలను 6767 యూనిట్లకు నేరుగా కేటాయించింది. అదే సమయంలో 1,87,052 కోట్ల రూపాయల పెట్టుబడుల ప్రతిపాదనలతో అవగాహనా ఒప్పందా(ఎంవోయూ)లు చేసుకొన్నారు. వచ్చిన పెట్టుబడులు 56,436 కోట్లు మాత్రమే. ఎంవోయూల ప్రకారం 8,84,389 మందికి ఉపాధి కల్పించవలసి ఉండగా 56,438 మందికి మాత్రమే ఉపాధి దొరికింది. ఫ్యాబ్‌సిటీ, బ్రహ్మణీస్టీల్స్‌కు భూములు కేటాయించినా నిర్మాణం ప్రారంభం కాలేదు. లార్డ్ స్వరాజ్ పాల్‌కి చెందిన కపారో గ్రూపు3,500 కోట్ల పెట్టుబడితో ఆటోమొబైల్ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పి మాంద్యం పేరుతో వెనక్కి తగ్గింది. ప్యాబ్‌సిటీలో వెయ్యికోట్ల పెట్టుబడితో పోలార్ పీవీ మాడ్యూక్స్ ఏర్పాటుకి ఎం.వో.యూ. కుదుర్చుకున్న మోసర్‌బేయర్ కూడా వెనక్కి పోయింది. 25వేల కోట్ల పెట్టుబడితో కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలిలో భారీ రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఒఎన్జీసీ కూడా తర్వాత చేతులు ఎత్తివేసింది. 5 వేల పెట్టుబడి ప్రతిపాదనలతో కూడిన నానోటెక్ పార్కు గురించి నేడు నోరు మెదపటంలేదు. ఫ్యాబ్‌సిటీలో యూనిట్లు ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చిన 19 కంపెనీలు ఎలాంటి పనులు చేపట్టకుండానే వెనుతిరిగాయి. రంగారెడ్డిజిల్లాలోని నాథర్‌గుల్‌లో వెయ్యికోట్ల పెట్టుబడితో ఏరోస్పేస్‌పార్క్ ఏర్పాటు చేస్తానని చెప్పిన యూనిటెక్ కూడా ఇప్పుడు అందుకు విముఖత చూపుతున్నది.

కొన్నింటికి పరిశ్రమలు ప్రారంభించనందుకు నోటీసులు జారీ చేయటం, కొన్ని నిర్మాణం ప్రారంభం కాని పరిస్థితి, మరి కొన్ని ఆ దశలో ఉన్నవే ఎక్కువగా ఉన్నాయి. చిన్న పరిశ్రమదారులు మాత్రమే ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.

పరిశ్రమలు ఏర్పాటు కాకపోయినా, ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా పరిశ్రామాధిపతుల నుండి భూములను తీసుకోకపోగా, ప్రభుత్వం రైతాంగం నుండి ఇంకా బలవంతంగా భూములు సేకరిస్తూనే వుంది. **విశాఖపట్నం జిల్లాలో** అత్యధికంగా 20,515 ఎకరాలు సేకరించింది. అందులో 10,520 ఎకరాలు పట్టా భూములు కాగా, మిగతావన్నీ పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములే. **రంగారెడ్డిజిల్లాలో** అత్యంత ఖరీదు అయిన 6908 ఎకరాలను సేకరించారు. ఇందులో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములు 4,958 ఎకరాలు కాగా మిగతా భూమి రైతాంగం నుండి తీసుకొన్నారు. **విజయనగరం జిల్లాలో** రెండు విద్యుత్ కేంద్రాలకు ప్రభుత్వం అనుమతి తెలిపింది. కొమరాడ మండలం కోటిపాం అటవీ ప్రాంతంలో 12 వేల కోట్ల రూపాయలతో 24 వేల మెగావాట్ల విద్యుత్ కేంద్ర నిర్మాణానికి 'ఆల్‌ఫ్రా' సంస్థ ముందుకు వచ్చింది. ఇందు కోసం 1674 ఎకరాలు కావాలని సంస్థ యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం వెయ్యి ఎకరాలు ఇస్తున్నట్లు 6 నెలలు క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో గిరిజనులు సాగు చేసుకుంటున్న 600 ఎకరాల డి.ఫారం పట్టాభూములు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని నాగావళి నదిలో నుంచి తీసుకోవటానికి ప్రభుత్వం అంగీకారం తెలపటం వలన శ్రీకాకుళం-విజయనగరం జిల్లాల్లో లక్షా 61 వేల ఎకరాలకు నీరు అందించే ఉద్దేశంతో నిర్మితమౌతున్న తోటపల్లి రిజర్వాయరుకు నీరు లభించని పరిస్థితి ఏర్పడుతుంది. **విశాఖజిల్లా** గంగవరం పోర్టు విస్తరణ కోసం గతంలో కేటాయించిన 18 వందల ఎకరాలకు అదనంగా మరో 1030 ఎకరాల సేకరణకు ఉత్తర్వులు జారీ చేసింది. కాకనాడ సెజ్‌కోసం ఇప్పటికే 12 వేల ఎకరాలను రైతాంగం ప్రతిఘటనల మధ్య బలవంతంగా స్వాధీనం చేసుకుంది. **విశాఖపట్నం-కాకినాడ** వరకు 110 గ్రామాల్లోని 604 చ.కి.మీ. పరిధిలో పెట్రోకారిడార్ ఏర్పాటుకి లక్షా యాభైవేల ఎకరాల భూసేకరణకు 2008 మే 24న జి.ఓ. 373ను విడుదల చేసింది. దేశీయ, విదేశీ ప్రైవేటు రంగం భాగస్వామ్యంతో రేవులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, భారీ పారిశ్రామిక పార్కులు, ఐటి పార్కులు, పెట్రో కెమికల్ కాంప్లెక్సులు, పెట్రోలియం రిఫైనరీలు, గ్యాస్ టెర్మినల్స్ నిర్మాణంతో పాటు 700 కి.మీ. రహదార్లు, రెండువందల కి.మీ. కొత్త రైలుమార్గం, అంతర్జాతీయ విమానాశ్రయం, పది హెలికాప్టర్ స్టేషన్లు, మూడు భారీరేవులు, 14 చిన్న రేవులు, 8 షిప్ ల్యాండింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. **గుంటూరు- ప్రకాశం జిల్లాల్లో** వాన్‌పిక్ ఏర్పాటుకోసం 28 వేల ఎకరాలను అల్‌ఖైమా బహుళజాతి సంస్థకు అతి చౌకగా కట్టపెట్టింది. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాంచర్లపాడు ప్రాంతంలో ఇఫ్‌కో కిసాన్ సెజ్‌కి 2,700 ఎకరాలను కట్టబెట్టి ఎటువంటి పనులు చేపట్టక పోయినా ఈ సంస్థకే మరో 4 వేల ఎకరాలను అప్పగించేందుకు రెవిన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎరువుల కర్మాగారం ఇఫ్‌కో ఇక్కడ వ్యవసాయ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఎస్‌పిఐ ఇఫ్‌కో కిసాన్ లిమిటెడ్ ద్వారా ప్రత్యేక ఆర్థిక మండలిని అభివృద్ధి చేయటానికి ఇఫ్‌కో నిర్ణయంగా ఉంది. ఇంకా టెక్స్‌టైల్, థర్మల్ విద్యుత్ కేంద్రాలకోసం వేలాది ఎకరాల భూసేకరణకు పూనుకొంది. **అనంతపురం** జిల్లాలో హిందూపురం దగ్గర్లో లేపాక్షి హబ్ పేరుతో ఒక మంత్రి సన్నిహితునికి వేలాది ఎకరాలు కట్టబెట్టింది. ఈ సంస్థకు కేటాయించిన భూముల్లోనే ప్రభుత్వరంగ సంస్థ బిడియల్ మిసైల్ ప్రాజెక్టుకు 600 ఎకరాలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థ సైన్స్ పార్కు ఏర్పాటు చేయటానికి వెయ్యి ఎకరాలను అప్పగించనున్నది. మిత్రా యూనివర్శిటీకి 150 ఎకరాలు కావాలంటున్నది. **చిత్తూరు జిల్లాలో** సత్యవేడులో శ్రీసిటీ సెజ్ కూడా 10 వేల ఎకరాలను స్వాధీనం చేసుకున్నది. ఈ సంస్థ భూసేకరణపై కోర్టులు, కేసులు నడుస్తున్నాయి.

సెజ్ చట్టం నిబంధనల ప్రకారం భూములు పొందిన పరిశ్రమాధిపతులు 24 నెలలలోపు పరిశ్రమలు నెలకొల్పాలి. భూములు కోల్పోయిన రైతాంగానికి ఉపాధి కల్పించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారి నుండి భూములు తిరిగి తీసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుండా, పరిశ్రమాధిపతులకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. భూ కుంభకోణాలు జరిగాయని అంటున్న ప్రతిపక్షాలు భూముల కేటాయింపును, భూసేకరణ చట్టాన్ని వ్యతిరేకించటం లేదు.

సెజ్‌ల పేరుతో వేలాది ఎకరాలను పరిశ్రమాధిపతులకు ప్రభుత్వం కట్టబెడుతూ కొత్త భూ ఎస్టేట్ దారులను సృష్టిస్తున్నది. పరిశ్రామాధిపతులకు కేటాయించిన భూముల్లో 25శాతం పరిశ్రమలకు వినియోగించి, మిగతాది వారి యిష్టం వచ్చినట్లు వినియోగించుకోవచ్చు. దీని వలన రియల్ ఎస్టేట్ వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతుంది. భూములు కోల్పోయిన రైతాంగం మాత్రం ఉపాధిలేక వలసలు పోతున్నారు. లక్షలాది ఎకరాలు పరిశ్రమలకు కట్టపెట్టటం వలన పంట భూముల విస్తీర్ణం తగ్గి ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కారిడార్-వాన్‌పిక్‌ల పరిధిలో ఏర్పాటు చేస్తున్న రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలు, రేవులు, హెలికాప్టర్ స్టేషన్లు, షిప్‌ల్యాండింగ్ కేంద్రాలు, పబ్‌లు పరిశ్రమాధిపతుల, బహుళజాతి కంపెనీల సరుకులను తక్కువ ఖర్చుతో రవాణా చేసేందుకు, వారు నేరుగా రాకపోకలు సాగించేందుకు, సరుకులు ఎగుమతులు దిగుమతులు సత్వరం జరిగేందుకు, వారి వినోదాల కోసం ఏర్పాటు చేస్తున్నవే. సెజ్‌లపేరుతో తీరప్రాంతం పైన, సముద్రంపైన పూర్తి ఆధిపత్యాన్ని సామ్రాజ్యవాదులు కోరుకుంటూన్న వ్యూహానికి అనుగుణంగా భారత పాలకులు వ్యవహరిస్తున్నారు.

మనకు సరిపోని, అవసరం లేనట్టి, ప్రజల అవసరాలను తీర్చనటువంటి పారిశ్రామిక విధానాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటును డిమాండ్ చేయాలి. సెజ్ చట్టాన్ని, భూ సేకరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని, రైతాంగం నుండి స్వాధీనం చేసుకొన్న భూములను వారికి తిరిగి యివ్వాలని ఉద్యమం సాగించాలి. ✡

# అమరుల వర్ధంతి సభ



వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ కోటయ్య

**ప్రొద్దుటూరు, 24-5-11 :**

అమరజీవుల స్థూపనిర్మాణ కమిటి ఆధ్వర్యంలో కమిటి కన్వీనర్ ఈడా అక్కతాతయ్య అధ్యక్షతన అమరుల సంస్మరణ సభ కృష్ణాజిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. తొలుత ఉపన్యాసకులు, స్థానిక కామ్రేడ్స్ అమరుల స్థూపంవద్ద పుష్పగుచ్ఛాలుంచి జోహార్లు అర్పించారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య ఈ సభలో మాట్లాడుతూ నల్లదొరల పరిపాలనకు వ్యతిరేకంగా స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాల్లో అమరత్వం పొందిన దేశభక్తులకు, తొలితరం కమ్యూనిస్టులకు, వారిబాట వీడకుండా ప్రయాణిస్తూ అశువులు బాసిన అమర జీవులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈనాటి స్థూప నిర్మాణ కమిటి కమ్యూనిస్టుల ఐక్య నిర్మాణం కోసం తపన పడుతూ ప్రజాసమస్యలపైన ఐక్య కార్యక్రమాలు, గ్రామ అభివృద్ధిని కూడా జోడించి పని చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఆర్థిక పరమైన విషయంలో అసమానతలు తొలగించలేకపోతే ప్రజలే ఈ రాజ్యాంగాన్ని కూలదోస్తారని రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆనాడే చెప్పారని, ఇదే విషయాన్ని కా॥ తరిమెల నాగిరెడ్డి ఉదహరిస్తూ ఆయన కోర్టు స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల విషయాన్ని ప్రస్తావిస్తూ వామపక్షాలు అధికారంలోకి వచ్చాయి, ఇప్పుడు ఓడిపోయాయనీ అయితే కమ్యూనిస్టు విధానాలను అమలు పర్చలేక పోయాయనీ, బూర్జువా విధానాలను అమలు పర్చుతూ ఊడిగం చేయడం మినహా ఏమీ చేయలేరని మరోసారి రుజువు పర్చారనీ, కనుక ప్రజలను విప్లవపోరాటాలలోకి సమీకరించి ప్రజాపోరాటాలతో బూర్జువా పార్లమెంటును ధ్వంసం చేసి నూతన ప్రజాతంత్ర వ్యవస్థను నిర్మించటం ద్వారా అమరులు కలలుకన్న ఆశయాలను నిజం చేసిన వాళ్ళమౌతాము కనుక ఈనాటి యువతరం ఆ కార్యక్రమానికి పూనుకొని విజయవంతం చేయ వలసిందిగా పిలుపునిస్తూ కా॥ కోటయ్య ముగించారు.

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు నాయకులు కా॥ గురవారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం సాగుకు గతం కంటే ఈసారి ఖర్చులు పెరిగిపోయి నష్టాల బారిన పడిన రైతాంగం దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని, చెరకు రైతులకు ఎకరానికి ఈ సంవత్సరం 10 వేల రూపాయలు నష్టం వచ్చిందని, పసుపు రైతుల పరిస్థితి, వరిరైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, పండిన పంటలు కొనేనాధుడు లేడని, కొన్నా ఇచ్చేధర గిట్టుబాటుగా లేక అప్పులపాలౌతున్నారని, పరిశ్రామాధిపతులకు అనేక రాయితీలు ప్రకటించిన పాలకులకు రైతాంగానికి రాయితీలు ఇవ్వటానికి చేతులు రావటం లేదనీ, మన ఎం.ఎల్.ఏ.లు ఎం.పి.లు జీతాలు, ఎలవెన్స్‌లు, పెంచుకోవటానికి చూపించిన ఐక్యత ప్రజల సమస్యలను చర్చించటానికి ఏమాత్రం చూపటంలేదనీ, ఈ గ్రామంలో కొన్ని స్వచ్ఛంధ సంస్థలు గ్రామ వాతావరణాన్ని, సంస్కృతిని కలుషితం చేస్తున్నాయని, పంచాయితీల పేరుమీద సెటిల్‌మెంటులు చేసి డబ్బులు దండుకుంటూ గ్రామ ఐక్యతని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈనాటి యువతరం ఈ అరాచకపు పద్ధతులను అరికట్టుటకు, గ్రామ ఐక్యతను నిలబెట్టుటకు ముందుకు రావాలని, అపుడే అమరులకు మనమందించే నిజమైన నివాళి అని ముగించారు.

ఈ సభలో స్థూపనిర్మాణ కమిటి సభ్యులు ఆళ్ళ సత్యనారాయణరెడ్డి, బొమ్మారెడ్డి రంగారెడ్డి, తొలితరం అమరుల సహచరుడు భీమవరపు వెంకట్రామిరెడ్డి; రైతు కూలీ సంఘం నాయకులు యు. వీరబాబు ఉపన్యసించారు. అనంతరం బొట్టా సాంబశివారెడ్డి వందన సమర్పణ చేశారు. ✡

# నిరుపేదలకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని ఆందోళన

**పిడుగురాళ్ళ 26-5-11 :**

పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ప్రదర్శన, ఎంఆర్‌ఓ ఆఫీసువద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ ఎన్. రాంబాబు మాట్లాడుతూ పిడుగురాళ్ళ పట్టణంలో పేదప్రజలు ఇళ్ళస్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, సంవత్సరాల తరబడి వేలరూపాయల అద్దెలు కట్టలేక, అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వాలు సంవత్సరాల తరబడి పాలన సాగిస్తూ కనీసం ఉండటానికి కూడా ఇళ్ళు ఇవ్వకుపోగా సెజ్‌ల, మైనింగుల పేర వేలాది ఎకరాల భూములను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని, తమ అధికారంకోసం వెంపర్లాట తప్ప పేదలు సమస్యలు ఏవీ పట్టడం లేదని, పేద ప్రజలు నివాసముంటున్న ఇళ్ళ స్థలాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు కా॥ ఎం. నిర్మల మాట్లాడుతూ పేదలు లేని రాజ్యంగా మార్చుతామని చెప్తున్న ప్రభుత్వాలు కనీసం ఉండటానికి



పిడుగురాళ్ళలో ధర్నా

స్థలం కూడా లేకుండా చేసి అసలు భూమి మీదే లేకుండా చేసే విధానాలను చేపడుతున్నారని, కూలీ నాలీ చేసకుంటూ జీవితాన్ని గడుపుతున్న ప్రజలకు ఉండటానికి నివాసం ఉంటే ఏదోరకంగా బ్రతికే పరిస్థితి ఉంటుందని, అసలే పెరుగుతున్న ధరలతో అల్లాడుతున్నవారికి ఇంటి అద్దెలు పెద్ద భారంగా మారాయని, అందువలన అర్హులైన నిరుపేదలకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ప్రజలందరూ కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇస్రాయిల్, కోటయ్య, భాస్కరరావు, పౌలేసు, జాని, రాజ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ✡

# పెట్రోలు ధరల పెంపుదలను నిరసిస్తూ ఆందోళన


కారంపూడిలో ప్రదర్శన


పిడుగురాళ్ళలో దిష్టిబొమ్మదగ్ధం



బందరులో ప్రదర్శన


అనంతపురంలో ప్రదర్శన

**ఒంగోలు, 16-5-11 :**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు ధరలను తగ్గించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ(ఎం-ఎల్) ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలోని స్థానిక ఈమనిపాలెం పార్టీ కార్యాలయం నుండి ఏనుగుచెట్టు సెంటరు. అంబేద్కరు విగ్రహం, హెచ్‌సిఎమ్ కాలేజి, చర్చిసెంటరు, ప్రకాశంభవనము, నెల్లూరు బస్టాండ్ సెంటరు, ఎల్ఐసి మీదుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన సందర్భంగా చర్చిసెంటరు వద్ద సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ ఎస్. లలితకుమారి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యుపిఎ పాలకులు సంవత్సరమునకు దాదాపు 6,7సార్లుగా యిప్పటికి 25 సార్లు పెట్రోఉత్పత్తుల ధరలను పెంచారని, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరలు పెరిగినందున ఇక్కడ పెంచవలసి వస్తుందని సాకు చెప్పి 25 నుండి 30 రూపాయలకు అమ్మవలసిన పెట్రోలుపై 60 శాతం మేర వివిధ పన్నులు వేసి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఖజానాలను నింపుకొంటూ వున్నాయని, ఆయిల్ ధరలు పెరగటంతో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు మరింతగా పెరిగి సామాన్యుడు ఒంటిపూట కూడా తిండి లేని పరిస్థితులు వస్తున్నాయని, మన దేశంలో వున్న సహజవాయువు, ఆయిల్ నిక్షేపాలను విదేశీ పెట్టుబడిదారులకు, రిలయన్స్ లాంటి బహుళజాతి సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టి, వారి వద్ద అంతర్జాతీయ రేటుకి ఆయిల్‌ని కొంటున్నారని, ఈ విధంగా సామ్రాజ్యవాదుల సేవలో పాలకులు పునీతులౌతూ మన ప్రజలకు కష్టాలను, ఆకలిని మిగుల్చుతున్నారని, పాలకులు అనుసరిస్తున్న ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఐక్య ఉద్యమాలు నిర్మించటమే పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ కా॥ ఎం.ఎస్. శాయి, ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ హనుమంతరావు, కోడె వెంకటరావు, రైతుకూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥ పరిటాల కోటేశ్వరరావు, జిల్లా నాయకులు కా॥ వి. శ్రీరాములు, ఎన్‌వైఎస్ నాయకులు కా॥ బి. సుబ్బారావు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కా॥ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు, 14-5-11 :**

యుపిఏ ప్రభుత్వం 9 నెలలకాలంలోనే ఇప్పటికి 8 సార్లు ఆయిల్ రేట్లను పెంచి సామాన్య ప్రజల నడ్డివిరిచిందనీ, అదేమంటే అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ రేట్లు పెరగటం వలన మనకు ఖర్చు ఎక్కువవుతుందనే నెపంతో వారి ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారనీ, కేంద్ర ప్రభుత్వం ఎప్పుడైతే పెట్రోల్‌పైన నియంత్రణ ఎత్తివేసిందో ఆయిల్ కంపెనీలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందనీ, కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, ఇలాంటి దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు మొత్తం సంఘటిత ఉద్యమాలకు సిద్ధంకావాలని ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి కా॥ కె. దేవా పెట్రోల్ ధరల వ్యతిరేక కార్యక్రమం సందర్భంగా మాట్లాడారు. ప్రదర్శన కా॥ అంగడి పున్నయ్య, దేవరశెట్టి శంకర్‌ల భవనం నుండి బయలుదేరి బాషా హోటల్, రింగ్‌రోడ్ వరకు సాగింది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తలలేని దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నగర సహాయ కార్యదర్శి ఎం. సురేష్, నగర నాయకులు బలరాంరెడ్డి, పిడిఎస్ఒ, జిల్లా అధ్యక్షులు వి. భారతి, జిల్లా నాయకులు సిహెచ్. సాగర్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**పిడుగురాళ్ళ, 16-5-11 :**

ప్రభుత్వరంగ చమురు సంస్థలకు నష్టాలు వస్తున్నాయనే సాకుతో పెట్రోలు ధరలను పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను ఏడుకొట్ల సెంటర్‌లో దగ్ధం చేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కా॥ నీలాద్రి రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చమురు సంస్థలు డీజిల్‌పై కూడా నియంత్రణను ఎత్తివేయడం కోసం పథకం రూపొందిస్తోందని ఇలాంటి ప్రభుత్వ దళారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్య మించాలని పిలుపునిచ్చారు.

స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎం. నిర్మల మాట్లాడుతూ తమది పేదల రాజ్యమని చెప్పుకుంటూ సామాన్యులు ఉపయోగించే కిరోసిన్, గ్యాస్ ధరలను పెంచాలనుకోవటం ప్రభుత్వం యొక్క ప్రజా వ్యతిరేక స్వభావానికి నిదర్శనమన్నారు.

**కారంపూడి, 17-5-11 :**

అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలను తాజాగా పెంచిందనీ, ఈ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కారంపూడి సెంటర్‌లో 'రాస్తారోకో' నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ జె. పద్మ మాట్లాడుతూ ఈ ధరల వలన సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని, ఆయిల్ ధరలు పెరగటంవలన అన్ని రకాల ధరలు పెరిగే అవకాశం ఉందని, ఇప్పటికే అందుబాటులోలేని నిత్యావసరాల ధరలు చుక్కలంటే పరిస్థితి ఉందని అన్నారు. తమది సంక్షేమ రాజ్యమని చెప్పుకుంటూ ఈ ప్రభుత్వాలు ప్రజల యొక్క జీవితాలను మరింత దారిద్ర్యంలోకి నెట్టివేస్తున్నాయని, ప్రైవేట్ ఆయిల్ కంపెనీలకు లాభాలను చేకూర్చుతూ కోటీశ్వరులను పెంచుతున్న ప్రభుత్వ దళారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో కా॥ మరియదాసు, వెంకటరత్నం, రాకేష్, వినోద్, బాలకృష్ణ, రాంమూర్తి, పున్నయ్య, కొండలు రైతుకూలీలు పాల్గొన్నారు.

**అనంతపురం, 19-5-11 :**

పెంచిన పెట్రోలు ధరలను వెంటనే తగ్గించాలని, రైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ స్థానిక రెవిన్యూ డివిజనల్ ఆఫీసు ఎదుట ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నానిర్వహించారు. ధర్నాకు ముందుగా ఎన్‌జిఓహోమ్ నుండి బండిపై ఆటోనుపెట్టి మహిళలు, కార్మికులు లాగుతూ టవర్ క్లాక్ చుట్టూ తిరిగి అక్కడ కేంద్ర ప్రభుత్వపు దిష్టిబొమ్మను గగ్ధం చేశారు. అక్కడ నుండి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ పి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో ఏపిఎఫ్‌టియు అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న మాట్లాడారు. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల మునుపు ఏ రకపు పన్నుల బాధా వుండదని చెప్పిన కేంద్రప్రభుత్వం, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజునే పెట్రోలు ధరలు పెంచి ప్రజల నడ్డి విరిగ్గొట్టిందన్నారు. దీని ప్రభావం ఆటోలు, రవాణా రంగానికే పరిమితం కాదని, నిత్యావసర వస్తువులపై ప్రభావం పడి ఇప్పటికే పెరిగిన ధరలు మరింత పెరగటానికి అవకాశం కల్పించారన్నారు. పెట్రోలు కంపెనీల ప్రయోజనాలకు ప్రాముఖ్యతనిస్తూ బహుళజాతి కంపెనీలకు వూడిగం చేస్తున్నారని విమర్శించారు. రైతుకూలీసంఘం జిల్లాకార్యదర్శి కా॥ బి. తిమ్మారెడ్డి మాట్లాడుతూ రైతాంగ పరిస్థితి రోజు రోజుకూ అధ్వాన్నంగా వుందని, పండించిన పంటకు గిట్టుబాటు ధరలులేక రైతాంగం రోడ్లపైకి వచ్చి తన ఆందోళనను ప్రకటించినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని తెలిపారు. జిల్లాలో ఈ నాటికీ వేరుశనగ విత్తనాలు పంపిణీకి నోచుకోలేదని, జిల్లా రైతాంగంలో- 2010లో నష్టపోయిన తాలూకు పంట నష్టపరిహారం 280 కోట్లు ఈ రోజుక్కూడా అందలేదని తెలిపారు. పెంచిన పెట్రోలు ధరల వల్ల మరింతగా మధ్యతరగతి కుటుంబాలు దిగజారే పరిస్థితులను కల్పించారని పేర్కొన్నారు. ఈసభలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనరు కా॥ ఎ. భూదేవి; శ్రీలక్ష్మి, ఆటోయూనియన్ కార్యదర్శి ఎ. నాగభూషణం; భవననిర్మాణసంఘం కార్యదర్శి సుధాకర్, రైతుకూలీసంఘం జిల్లా నాయకులు హెచ్. హనుమంతు పాల్గొన్నారు.

ప్రజాకళాకారులు జనం పాటలు వినిపించారు. దాదాపు 150 మంది పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

**మచిలీపట్నం, 16-5-11 :**

పెట్రోలు ధరల పెంపుకు నిరసనగా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన బస్టాండు సెంటరు నుండి కోనేరు సెంటరు వరకూ సాగింది. అనంతరం ఏఫిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి యద్దనపూడి సోని మాట్లాడుతూ యుపిఎ-2 ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 8వ సారి పెట్రోలు ధరలు పెంచిందని అన్నారు. ప్రైవేటీకరణలో భాగంగానే పెట్రోలు ధరలపై కేంద్ర ప్రభుత్వం తన నియంత్రణను ఎత్తివేసినందుకు ఫలితంగా ఆయిల్ రంగంలో ఉత్పత్తి, సరఫరాపై బడా కంపెనీల ఆధిపత్యం పెరుగు తున్నదన్నారు. త్వరలో డీజిల్, గ్యాస్ ధరలు కూడా పెంచబోతున్నారని భవిష్యత్తులో ఈ రంగాలను బడా కంపెనీలకు కట్టబెట్టేందుకు వీటిపైన కూడా నియంత్రణ ఎత్తివేయబోతున్నారన్నారు, ప్రతి సంవత్సరం పెట్రోలు 10 రూపాయలు పెంచుతున్నారని, ఈ విధంగా చూసుకుంటే లీటరు పెట్రోలు ధర 100 రూపాయలకు చేరే అవకాశం వుదని అన్నారు. అన్నిరకాల నిత్యావసర ధరలతో పాటు పెట్రోలు ధరలు కూడా సామాన్య మానవునికి పెనుభారంగా వుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వై. జగన్, పామర్తి అంజమ్మ, కొప్పినేని ఉమా మహేశ్వరరావు, ముచ్చు సుధాకర్, బెల్లంకొండ రవి, తదితరులు పాల్గొన్నారు. ◈

# గిట్టుబాటు ధరల సాధనకై ఆందోళన

**సూర్యాపేట, 16-5-11 :**

**నల్గొండజిల్లాలో** ఈ రబీకి వేసంగి పంటగా దాదాపు 2 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. ఎన్నో కష్ట నష్టాల మధ్య రైతాంగం గణనీయమైన దిగుబడులు సాధిచారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండ బోతున్నాయని ప్రభుత్వానికి ముందే తెలిసినా పంటలను కొనుగోలు చేసే యంత్రాగాన్ని సమాయత్తం చేయడం దగ్గర నుంచి కావల్సిన బస్తాలు, తూనిక యంత్రాలు సైతం సరఫరా చేయలేదు. ప్రభుత్వం విధానపరంగానే వ్యవహరించి ఎఫ్.సి.ఐ.లను రైతునుంచి నేరుగా కొనుగోళ్ళు చేయకుండా చేస్తూ ప్రైవేటు మిల్లర్ల దయాదాక్షిణాలకు రైతాంగాన్ని వదిలివేసింది.

దీనికితోడు వేసంగి పంట కాలంలో తెలంగాణాలో రాళ్ళ వర్షాలు పడతాయని, అకాల వర్షాలకు రైతాంగం అవస్తల పాలవుతారని తెలిసికూడా ప్రభుత్వం రైతులను వారి మానానికి వార్ని వదిలేసింది.

రైతాంగం ధాన్యాన్ని తరలించాల్సిన మార్కెట్ యార్డులలో గోడౌన్లు ఖాళీలేవనే పేరుతో కొంతకాలం, తేమ ఎక్కువ ఉందనే పేరుతో రకరకాల సాకులతో కొనుగోలు చేయక పోవటంతో ధాన్యాన్ని యార్డుకి తెచ్చిన రైతు 2-3 రోజులు పాటు తిండితిప్పలు లేకుండా పడిగాపులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ప్రభుత్వం ఏర్పరిచిన ఇందిర క్రాంతి పథకం ఐ.కె.పి. పేర ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాలకు సరిపడినన్ని గోనె సంచులు సరఫరా చేయలేదు. ఐ.కె.పి. కానీ, మార్కెట్‌యార్డుకి కానీ ధాన్యం చేరాక వర్షం వస్తే కప్పేందుకు సరిపడినన్ని టార్పాలిన్‌లు లేనందున సూర్యాపేట వంటి అనేక ప్రాంతాలలో ధాన్యం యార్డులలో తడిసిపోయింది. ఈ విధంగా జిల్లాలో షుమారు 11.50 లక్షల క్వింటాళ్ళు పండించిన రైతు, కూలీలు పంట చేతికి వచ్చే సమయంలో అనుభవించిన మానసిక క్షోభ వర్ణించడం సాధ్యంకానిది. వీటన్నింటి పరిస్థితుల మధ్య విధిలేక రైతాంగం క్వింటాకి రూ॥ 1030 మద్దతు ధర ఉన్నప్పటికీ 800-950 వరకే మిల్లర్లకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మామిడి, ఇతర పంటల పరిస్థితి ఉన్నది. గత సంవత్సర జల్ తుఫాను నష్టపరిహారమే ఇంకా అందని స్థితిలో రైతాంగం ఇటీవల కురిసిన వర్షాలకు మరింత నష్టపోయింది.

ఈ పరిస్థితులలో గిట్టుబాటు ధరపై రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) నల్గొండజిల్లా ఆర్గనైజింగ్ కమిటి ఒక కరపత్రం తెచ్చి విస్తృతంగా ప్రచారం చేస్తూ సూర్యాపేట ఆర్‌డిఓ కార్యాలయం వద్ద అధికారులను కలిసి నిరసన తెలిపింది. రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య రైతుకూలీ సంఘం నాయకులతో కలసి ప్రభుత్వాధికారులకు పరిస్థితిని వివరించారు. తక్షణం రైతాంగానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, గత సంవత్సరం నుండి వివిధ తుఫాన్లకి నష్టపోయిన రైతాంగానికి అందించాల్సిన నష్ట పరిహారాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

రైతుకూలీ సంఘం జిల్లా కన్వీనర్ బి. వెంకటరెడ్డి, నాయకులు కా॥ వేలాద్రి, రామన్న తదితరులతో కలసి రాష్ట్ర కార్యదర్శి కోటయ్య , నూతన్‌కల్, తుంగతుర్తి ప్రాంతాల ఐ.కె.పి. కేంద్రాలను పరిశీలించారు. అక్కడ జరిగిన సమావేశాలలో సంఘటిత పోరాటాలు తప్ప రైతాంగానికి మరో మార్గంలేదని వివరించారు. ప్రతిసంవత్సరం రైతాంగం కొన్ని వందల కోట్లు ఈ జిల్లాలోనే నష్టపోతున్నది. రైతు కూలీల కష్టార్జితాన్ని కాపాడుకునేందుకు పంటకి గిట్టుబాటు ధరకోసం పోరాడాల్సి ఉందని పిలుపునిచ్చారు. ◈

కాంతి కేంద్రాలా
మృత్యు మందిరాలా ?
పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-
మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి, ఏలూరురోడ్, విజయవాడ

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010